ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



గురువారం | 02-04- 2026 | సంపుటి: 16, సంచిక: 358, నిజామాబాద్, పేజీలు: 8, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆


## భూ సమస్యలకు

# శాశ్వత పరిష్కారం

### సమీకృత భూభారతి పోర్టల్‌తో తొలి అడుగు

**నేటి నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు**

**స్మార్ట్ ఫోన్‌తో ఇంటినుంచే భూ సేవల లభ్యత**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ప్రజాకలం) : రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచన మేరకు రెవెన్యూ శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తయారు చేశామన్నారు. ఈ పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని వెల్లడించారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేరళం పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి బుధవారం నాడు ఈ పోర్టల్ ప్రారంభానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 2నుంచి ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లవలసిన

తరువాయి 2వ పేజీలో...

## ఆపరేషన్ కగార్

# సక్సెస్



### ఆరు దశాబ్దాల సాయుధ పోరాటానికి తెర?

- **11 రాష్ట్రాలు మావోయిస్టు రహిత రాష్ట్రాలుగా ప్రకటన**
- **చివరి రోజున 44 మంది మావోయిస్టులు లొంగుబాటు**
- **21 మంది కేంద్రకమిటీలో ఒక్కరు మినహా అందరూ లొంగుబాటు**
- **2023లో ప్రారంభమైన ఆపరేషన్ కగార్**
- **కర్రెగుట్టలు టార్గెట్గా చేపట్టిన ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్**

న్యూఢిల్లీ : దేశంలో నక్సలిజం అంతం చేయడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా విధించిన డెడ్లైన్ నిన్నటితో ముగిసింది. చివరిరోజున మరో 44 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఛత్తీస్గఢ్లో 35 మంది బీజాపూర్లో 25 మంది, దంతెవాడలో ఐదుగురు, సుక్మాలో ఇద్దరు, నారాయణ్పూర్లో ఒక్కరు, కాంకేర్లో ఇద్దరు మహారాష్ట్రలోని గడ్చిరోలిలో తొమ్మిది మంది నక్సలైట్లు ఆయుధాలు వీడి జనజీవన ప్రవంతిలో కలిశారు. కేంద్రం విధించిన డెడ్లైన్ ముగిసిన నేపథ్యంలో పలు రాష్ట్రాలు మావోయిస్టుల నుంచి విముక్తి పొందినట్టుగా ప్రకటించుకున్నాయి. మావోయిస్టు పార్టీ పొలిట్బ్యూరో, కేంద్ర కమిటీ లేదని వారంతా లొంగిపోయారని లేదా అరెస్టయ్యారని, లేదా ఎన్కౌంటర్ అయ్యారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మొన్న పార్లమెంటులో వెల్లడించారు. దాదాపుగా దేశంలో నక్సలిజం అంతమైపోయిందని డెడ్లైన్కు ఒక రోజు ముందు ప్రకటించారు. తమ రాష్ట్రంలో నక్సలిజం లేదని మొన్న ఆంధ్రప్రదేశ్ ప్రకటించింది. తమ రాష్ట్రం నుంచి ఉద్యమంలో చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే ఉన్నారని తెలంగాణ వెల్లడించింది. సుమారు డజను మంది నక్సలైట్లు మిగిలారని, వారి లక్ష్యంగానే ఆపరేషన్ చేపడుతామని ఒడిశా పేర్కొంది. డెడ్లైన్తోనే నక్సలైట్ల లొంగుబాటు

తరువాయి 2వ పేజీలో...

## వయోవృద్ధుల సంక్షేమం, భద్రత

# ప్రభుత్వ లక్ష్యం

### - మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 01 (ప్రజా కలం) వయోవృద్ధుల సంక్షేమం, భద్రత, గౌరవప్రదమైన జీవనాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పరిరక్షణ, పర్యవేక్షణ బిల్లు, 2026 ను ప్రవేశపెట్టినట్లు అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో బుధవారం వయోవృద్ధులతో సమావేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ శైలజ, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగులు తమ వయోవృద్ధుల సంరక్షణకు బాధ్యతగా తీసుకోవాలని, తల్లిదండ్రుల ఆర్థిక, వైద్య అవసరాలను తీర్చేందుకు ఉద్యోగులు తమ వేతనం నుండి కనీసం 15 శాతం లేదా రూ.10,000 (ఏది ఎక్కువైతే అది) మొత్తాన్ని కేటాయించి, నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ బిల్లు అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రతి శాఖలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు ఇందులో భాగస్వాములై పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు. తల్లిదండ్రుల సంరక్షణలో నిర్లక్ష్యం చూపిన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రయివేట్ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకునేలా బిల్లు నిబంధనలు రూపొందించబడినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఫిర్యాదులను స్వీకరించి 60 రోజుల లోపు పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, అప్పీల్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసి, కమిటీలకు క్వాసి-జ్యుడీషియల్ అధికారాలు కల్పించనున్నట్లు తెలిపారు. బయోలాజికల్ మరియు దత్తత తల్లిదండ్రులు, వృద్ధాప్య కారణంగా ఆధారపడే తల్లిదండ్రులు ఈ బిల్లులో అర్హులుగా పేర్కొన్నారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 41, సీఆర్పీసీ సెక్షన్ 125, సీనియర్ సిటిజన్స్ చట్టం, 2007 నిబంధనల ప్రకారం రూపొందించబడినట్లు తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసి, కుటుంబ బాధ్యతలను చట్టబద్ధంగా అమలు చేయడం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. వయోవృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక మరియు నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, వారికి ఆర్థిక భద్రత, గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు ఈ బిల్లు రూపొందించినట్లు తెలిపారు. ఈ బిల్లుతో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు

తరువాయి 2వ పేజీలో...



## విభజన హామీలు

# అమలు చేయాలి

### తెలంగాణకు న్యాయం చేయండి

**- లోక్‌సభలో కేంద్రాన్ని నిలదీసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**

**- బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి**

**- ఖమ్మం, పాలమూరును పట్టించుకోండి**

**- భద్రాచలం నుంచి ఆంధ్రా లో కలిసిన నాలుగు గ్రామపంచాయతీలను తిరిగి ఇచ్చేయండి**

**- కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేసి, కేటీపీఎస్ విస్తరణ పై దృష్టి సారించాలని గళమెత్తిన రామసహాయం**

ఖమ్మం ఏప్రిల్ 01(ప్రజా కలం న్యూస్ ) ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమలుపై ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి లోక్‌సభలో బుధవారం గళమెత్తారు. విభజన సమయంలో తెలంగాణ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. సంస్థాగత, ఆర్థిక, మౌలిక రంగాలకు సంబంధించిన పలు కీలక అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు.

తరువాయి 2వ పేజీలో...

## సింగల్ విండో కార్యాలయంలో

# ఉద్యోగస్తుల మందు పార్టీ

### ఆఫీసులోనే తప్ప తాగి తందనాలాడుతున్న ఉద్యోగులు

**టేబుళ్ల పై క్యాష్ కాదు... మద్యం బాటిళ్లు..**

**చైర్మన్ చాంబర్ నే సిట్టింగ్ రూంగా మార్చిన వైనం**


**నిబంధనలు పక్కన పెట్టీ,ఫుల్ ఎంజాయ్... సోషల్ మీడియాలో వైరల్**

యాదాద్రి మోత్కూరు ఏప్రిల్ 1 ప్రజాకలం: మోత్కూరు మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఉద్యోగుల సిట్టింగ్ బాగోతం మంగళవారం రాత్రి కాస్త బట్టబయలైంది. కార్యాలయ ఉద్యోగులు సిట్టింగ్ రూమ్ గా మార్చి మందు పార్టీ చేసుకున్నారు. మంగళవారం రాత్రి వేళ చైర్మన్ ఛాంబర్ లో నలుగురు ఉద్యోగులు మద్యం బాటిళ్లు,మిర్చి బజ్జీలతో మద్యం పార్టీ చేసుకోవడంతో స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తరువాయి 2వ పేజీలో...



## కలం కౌంటర్




## ఢిల్లీలో తెలంగాణ

# ఆకాంక్షల ధ్వని

### - పార్లమెంట్‌లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ గళం



పెద్దపల్లి,ఏప్రిల్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పార్లమెంట్ వేదికగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ తెలంగాణ ఆకాంక్షలను,హక్కులను చాటి చెప్పారు. నీళ్లు,నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన తెలంగాణకు నేటికీ కేంద్రం

తరువాయి 2వ పేజీలో...

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మొదటి పేజీ తరువాయి...

పనిలేకుండా తన ఇంటి నుంచే భూ సేవలు పొందేవిధంగా పోర్టల్‌ను రూపొందించామని అన్నారు. రైతులు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరిగేవారని,. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి నుంచే భూభారతి పోర్టల్ ద్వారా పొందవచ్చన్నారు. రైతు లాగిన్ అయిన వెంటనే తనకు ఉన్న భూమి వివరాలు కనిపిస్తాయి. ఎన్నిఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు ఎంతచెల్లించాలో కనిపిస్తుంది. ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళుతుంది. ఆతర్వాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారు. తర్వాత ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమేగాక సర్వేకూడా రోవర్లతో పూర్తి చేస్తారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక అది మండల సర్వేయర్ స్క్రూటినీకి వెళుతుంది. ఆపై మండల తహశీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారైన రైతుకు ఎల్‌పిఎమ్, భూధార్ నెంబర్‌ల కేటాయింపు జరుగుతుంది. ఈ వివరాలు భూభారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయి.

సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ ను జనరేట్ చేసి భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ ఎమ్ ఎస్ అలర్ట్స్ పంపిస్తారు.

భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్ ( ఎల్‌పిఎమ్) యూనిక్ నెంబరు, అదేవిధంగా ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని వెల్లడించారు.

ఈ ఐదు మండలాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్నతర్వాత సర్వే నిర్వహించడానికి అవసరమైన సర్వేయర్లను అందుబాటులో ఉంచామని అలాగే గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి రోవర్లతో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. దీనివల్ల సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని, కచ్చితమైన సర్వే వివరాలు వస్తాయని తెలిపారు.

భూ సమస్యలు రైతు జీవితంలో పెద్ద అడ్డంకిగా మారాయని వాటికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ఒక కీలకమైన ముందడుగు అని రైతు ఇంటి నుంచే అన్నిసేవలు పొందేలా పారదర్శక వ్యవస్థను తీసుకువస్తున్నామని ఇది రెవెన్యూ వ్యవస్థలో చారిత్రాత్మక మార్పునకు నాంది అవుతుందని మంత్రి పొంగులేటి అన్నారు.

### సింగల్ విండో కార్యాలయంలో

# ఉద్యోగస్తుల మందు పార్టీ

మొదటి పేజీ తరువాయి...

అర్ధరాత్రి వరకు మోత్కూర్ సింగిల్ విండో కార్యాలయన్ని తెరిచి ఉంచి యదేచ్ఛగా కార్యాలయంలోని నలుగురు ఉద్యోగులు మందు తాగుతూన్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు చైర్మన్ చాంబర్ కు ఏమాత్రం విలువ ఇవ్వకుండా ఉద్యోగస్తులు అలసత్వం వహిస్తున్నారు. విధులు ముగించుకొని కార్యాలయం మూసేసి వెళ్లాల్సిన ఉద్యోగులు ఇలా కార్యాలయంలోనే మందుపాటు చేసుకోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం కాస్తా కోరం లేకపోవడంతో వాయిదా పడింది. రైతులకు పూర్తి స్థాయిలో సమావేశం సంబంధించి సమాచారం ఇవ్వలేదని ఓ వైపు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే... అదే కార్యాల యంలో అర్ధరాత్రి వరకు ఉద్యోగులు మద్యం పార్టీ చేసుకోవడంతో రైతులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గం గడువు ముగియడంతో.. అధికారుల పాలన కొనసాగుతుండటంతో ఉద్యోగులపై అజమా యిషీ లేకపోవడంతోనే ఏకంగా చైర్మన్ ఛాంబర్ లో ఇష్టారాజ్యంగా మద్యం పార్టీ చేసుకున్నారని, సదరు ఉద్యోగులపై సహకార సంఘం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

# విభజన హామీలు అమలు చేయాలి

మొదటి పేజీ తరువాయి...

**హామీలు కాగితాలకే పరిమితం కావద్దు**

విభజన చట్టంలో తెలంగాణ అభివృద్ధి కోసం అనేక హామీలు, కట్టుబాట్లు ఉన్నప్పటికీ, వాటి అమలు ఇంకా పూర్తికాలేదని రఘురాం రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హామీలు కాగితాలకే పరిమితం కాకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**జాతీయ స్థాయి విద్యాసంస్థలు అవసరం**

తెలంగాణలో ఎన్ఐటి (నైటీ ), ఐఐఎం (ఐఐమ్ ), ఐఐఎస్ఇఆర్ (ఇఇజర్ ), సెంట్రల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే ఉన్న విద్యాసంస్థలను జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లాలని సూచించారు.

**పారిశ్రామికాభివృద్ధి, ఐటీ విస్తరణ**

ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి కేంద్రం మద్దతు ఇవ్వాలని, హైదరాబాద్ ఇప్పటికే ఐటీ హబ్‌గా ఉన్నందున దాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**ఖమ్మం జిల్లా ప్రస్తావన**

మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సెక్షన్ 94(2) కింద రావాల్సిన ఆర్థిక తోడ్పాటు ఇంకా పూర్తిగా అందలేదని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఎప్పుడు..?**

సెక్షన్ 93 ప్రకారం బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు హామీ ఇంకా నెరవేరలేదని పేర్కొంటూ దీనిపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు.

**నీటి వనరులపై న్యాయం**

గోదావరి, కృష్ణా నదులు తెలంగాణలోనే అత్యధికంగా ప్రవహిస్తున్నందున, రెండు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి నది యాజమాన్య బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని కోరారు.

కేటీపీఎస్ కు సంబంధించి..

కేటీపీఎస్ (ఖుూూ) థర్మల్ పవర్ స్టేషన్‌కు అదనంగా 825 మెగావాట్ల సామర్థ్యాన్ని పునరుద్ధరించాలని సూచించారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి

రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) కోసం.. అదనపు నిధులు కేటాయించాలని కోరారు.

కొత్తగూడెంకు ఎయిర్ పోర్ట్ కావాల్సిందే..

వరంగల్‌కు విమానాశ్రయం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, కొత్తగూడెం మరియు ఆదిలాబాద్/పెద్దపల్లి ప్రాంతాల్లో కూడా విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు.

**భద్రాచలం గ్రామాల సమస్యపై..**

రెండో సవరణలో భద్రాచలం అసెంబ్లీ పరిధిలోని నాలుగు గ్రామ పంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని కోరారు.

ఏపీ సోదర, సోదరీమణులారా..

అది బ్లాక్ డే కాదు..

రెండు రాష్ట్రాల అభివృద్ధికి చక్కటి అవకాశం ఆంధ్రప్రదేశ్ సోదర సోదరీమణులరా.. అని పేర్కొని ప్రత్యేకంగా విన్నపం చేస్తూ. రాష్ట్ర విభజనను ఒక చీకటి రోజుగా చూడవద్దని సూచించారు. ఇది రెండు రాష్ట్రాల అభివృద్ధికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు.

సమాన న్యాయం చేయాలి

ఆంధ్రప్రదేశ్‌కు అదనపు నిధులు ఇవ్వడంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే అదే విధంగా తెలంగాణ అభివృద్ధికి కూడా ఈ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. రెండు రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందేలా చూడాలని సూచిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# ఆపరేషన్ కగార్ సక్సెస్

మొదటి పేజీ తరువాయి...

కార్యక్రమం ముగిసిందని, ఇక లొంగుబాట్లకు అవకాశం లేదని, ఉన్నవారిని ఎన్కౌంటర్ చేయడమే మిగిలిన లక్ష్యమని ఒడిశా ఏడీజీపీ సంజీబ్ పాండా స్పష్టం చేశారు. మావోయిస్టు ఉద్యమం మన దేశంలో ఆరు దశాబ్దాలపాటు సాగింది. తొలినాళ్లలో విశేష ప్రజాధారణతో దావానలంలా వ్యాపించింది. దాదాపు దజను రాష్ట్రాలకు విస్తరించిన ఉద్యమం క్రమంగా ప్రధానంగా 3 నాలుగు రాష్ట్రాలకు కుచించుకుపోయింది. పీక్ స్టేజ్లో 126 జిల్లాల్లో కార్యకలాపాలు సాగించిన మావోయిస్టు పార్టీ.. దండకారణ్యంలో కొన్నాళ్లు సమాంతర ప్రభుత్వాన్నీ నడిపింది. కాగా, 2019లో దేశంలో మావోయిజాన్ని పూర్తిగా అంతమొందించాలని కేంద్రం ఒక నిర్ణయాన్ని తీసుకుంది. 2024లో ఛత్తీస్గఢ్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆపరేషన్ కగార్ అనూహ్య వేగాన్ని అందుకుంది. రెండేండ్ల ముందుగానే కేంద్ర హోంమంత్రి అమిత్ షా డెడ్లైన్ విధించారు. 2023లో ఆపరేషన్ కగార్ మొదలుపెట్టాక మావోయిస్టు పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతూ వచ్చింది. పార్టీని దాదాపుగా అంతమొందించే లక్ష్యంలో ఈ ఆపరేషన్ సఫలమవ్వగా.. గతేడాది ఏప్రిల్ 21 నుంచి మే 11 మధ్య కర్రెగుట్టలు టార్గెట్గా చేపట్టిన ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్లో పార్టీ చీఫ్ నంబాల కేశవరావు ఎన్కౌంటర్ ఒక కుదుపు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కమాండర్ మాడ్వి హిడ్మా ఎన్కౌంటర్తో పార్టీకి మరో గట్టి దెబ్బ తగిలింది. కగార్ ఆపరేషన్లో భాగంగా జరిగిన ఎన్కౌంటర్లలో నంబాల, చలపతి, వివేక్, గౌతమ్, గాజర్ల రవి, భాస్కర్, కట్టా రామచంద్రారెడ్డి, కదిరి సత్యనారాయణ రెడ్డి, హిడ్మా, గణేశ్, ప్రయాగ్లు మరణించగా.. సోనూ, ఆశన్న, దేవ్జీ, మల్లా రాజిరెడ్డి వంటి అగ్రనాయకత్వం లొంగిపోయింది. దీంతో మావోయిస్టు పార్టీకి నాయకత్వం దాదాపుగా లేకుండా పోయింది. దీంతో కిందిస్థాయి కేడర్లు కూడా పెద్ద సంఖ్యలో లొంగుబాటపట్టారు. డెడ్లైన్లోపు మావోయిస్టు పార్టీ క్రియాశీలక నాయకత్వం దాదాపుగా లేకుండాపోయింది. అక్కడక్కడ కొన్ని కేడర్లు ఉన్నా స్వల్పకాలంలోనే వారంతా లొంగిపోవడమో లేదా ఎన్కౌంటర్ అవ్వడమో జరిగే పరిస్థితులున్నాయి. దాదాపుగా ప్రస్తుతం దేశంలో మావోయిస్టు పార్టీ ఉనికి లేదని చెప్పొచ్చని స్వయంగా కేంద్రమంత్రి అమిత్ షానే చెప్పారు. అయితే, ఫార్మల్గా త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఇంకా అజ్ఞాతంలోనే ఉన్న మావోయిస్టు పార్టీ కీలక నేతలు గణపతి, మిసిర్ బెస్రా, పసునూరి నరహరిల చుట్టూ ఆసక్తి నెలకొంది. మావోయిస్టు పార్టీ మాజీ చీఫ్ గణపతి అడవిలో లేదని, పట్టణ ప్రాంతంలోనే ఉండి ఉంటాడని తెలంగాణ పోలీసులు పేర్కొన్నారు.

### వయోవృద్ధుల సంక్షేమం, భద్రత

# ప్రభుత్వ లక్ష్యం


మొదటి పేజీ తరువాయి...

తమ తల్లిదండ్రుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం పెరుగుతుందని, కుటుంబ విలువలను కాపాడటానికి ఇది దోహదపడుతుందని మంత్రి వివరించారు. తల్లిదండ్రుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా బలమైన నిబంధనలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి శాఖలో పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి, ఫిర్యాదుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఈ బిల్లును సమర్థవంతంగా అమలు చేయాలని, వృద్ధుల సంక్షేమానికి అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమం మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వయోవృద్ధుల కొరకు దేశంలోనే మొట్ట మొదటి సారిగా పూర్తిస్థాయిలో పటిష్టమైన బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదం తెలిపేలా కృషి చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిగారికి కి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల భవనానికి కావాల్సిన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లు సమాజానికి ఎంతో అవసరమైనదని పేర్కొన్నారు. ఆధునిక జీవనశైలిలో కుటుంబ బంధాలు కొంతవరకు తగ్గుతున్న నేపథ్యంలో తల్లిదండ్రుల పట్ల బాధ్యతను గుర్తుచేసేలా ఈ చట్టం మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. ఉద్యోగులు తమ తల్లిదండ్రుల ఆర్థిక, ఆరోగ్య అవసరాలను తీర్చడం ద్వారా కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ బిల్లులో పొందుపరిచిన నిబంధనలు వృద్ధుల భద్రతను పెంపొందించడంతో పాటు, వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వయోవృద్ధుల కొరకు ఏర్పాటు చేసిన సదన్ భవనానికి కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని మంజురు చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ బిల్లును సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని తెలిపారు. బిల్లులో పేర్కొన్న నిబంధనల మేరకు ప్రతి శాఖలో పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి, తల్లిదండ్రుల సంరక్షణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని అన్నారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా స్వీకరించి, 60 రోజులలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తల్లిదండ్రుల సంరక్షణలో నిర్లక్ష్యం చూపే ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. అదేవిధంగా, అర్హులైన వృద్ధులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలు, పథకాల గురించి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు కార్యక్రమం ప్రారంభంలో ఈ బిల్లు ఉద్దేశాల గురించి వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ శైలజ వివరించడం జరిగింది మరియు వయోవృద్ధుల ప్రతినిధులు వారి అభిప్రాయాలను తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి ప్రత్యేక చొరవతో "తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పరిరక్షణ మరియు పర్యవేక్షణ బిల్లు, 2026"ను ప్రవేశ పెట్టినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు గజమాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ పత్రిక పిలుపు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బి.ఎస్. లత, బి. రాజ గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### రెండు నెలలకు సరిపడా

# ముడి చమురు నిల్వలు

### - పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ




న్యూఢిల్లీ: రాబోయే రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు దేశంలో ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ బుధవారంనాడు తెలిపారు. రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, రిటైల్ అవుట్‌లెట్‌లలో ఇంధనం అందుబాటులో ఉందని, ఎలాంటి ఇంధన కొరత లేదని చెప్పారు. అంతర్జాతీయ ధరల ట్రెండ్‌ను ప్రస్తావిస్తూ, రెండు నెలల క్రితం వరకూ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్లు ఉండగా, అది ఇప్పుడు 100 డాలర్లు దాటిందని చెప్పారు. ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ దేశీయ వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని తెలిపారు. 2022 ఏప్రిల్ 6 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని, 2024 మార్చిలో ధరలు రూ.2 చొప్పున తగ్గించామని, ఇప్పటికీ అదే అమల్లో ఉందని వివరించారు. అంతర్జాతీయ ధరల్లో అస్థిరత నుంచి దేశీయ వినియోగదారుల పరిరక్షణకు భారత ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించిందని, తద్వారా ధరల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా చర్యలు తీసుకుందని చెప్పారు. దేశీయ మార్కెట్‌లో ఏటీఎఫ్, డీజిల్ లభ్యత కోసం ఎగుమతులపై సుంకం విధించినట్టు చెప్పారు.

**ప్యానిక్ కొనుగోళ్లు వద్దు...** పెట్రోల్, డీజిల్ తగినంతగా అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని కోరారు. గృహావసరాలు, సీఎన్‌జీ ట్రాన్స్‌పోర్ట్‌కు 100 శాతం సరఫరాకు భరోసా ఇచ్చారు. విస్తరణ ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. మార్చిలో 3,25,000 కనెక్షన్లకు నేచురల్ గ్యాస్ సరఫరా చేశామని, 2,85,000 కొత్త కనెక్షన్లు ఇచ్చామని, 3,50,000 కొత్త వినియోగదారులు కనెక్షన్ కోసం రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. ఎల్జీజీకి సంబంధించి 60 శాతం దిగుమతులపై మనం ఆధారపడి ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు (సౌదీ సీపీ బెంచ్‌మార్క్) 522 డాలర్ల నుంచి 780 డాలర్లకు పెరిగిందన్నారు. అయినప్పటికీ డొమెస్టిక్ వినియోగదారుల ఎల్‌పీజీ సిలెండర్ల ధరలను పెంచలేదని చెప్పారు. ధరల్లో పెరుగుదల వల్ల తలెత్తిన నష్టాన్ని తట్టుకునేందుకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీలు) ప్రభుత్వం సపోర్ట్ అందిస్తోందన్నారు. 2023లో ఓఎంసీలకు రూ.22,000 కోట్లు కేటాయించగా, 2025-26లో సుమారు రూ.30,000 కోట్లకు ఆమోదం తెలిపామని చెప్పారు. ఏ ఒక్క గ్యాస్ ఏజెన్సీ నుంచి స్టాకు లేదనే సమాచారం లేదని, మంగళవారంనాడు కూడా 60 లక్షల సిలెండర్ల పంపిణీ జరిగిందని చెప్పారు.

# ఢిల్లీలో తెలంగాణ ఆకాంక్షల ధ్వని

మొదటి పేజీ తరువాయి...

నుండి ఆశించిన స్థాయిలో న్యాయం జరగడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. 1969 తెలంగాణ ఉద్యమ పోరాట స్ఫూర్తిని స్మరిస్తూ, నాటి ఉద్యమంలో తన తాత, దివంగత నేత కాకా వెంకటస్వామి వంటి హేమాహేమీలు చేసిన త్యాగాలను ఈ సందర్భంగా సభ దృష్టికి తెచ్చారు. రాష్ట్రానికి దక్కాల్సిన నదీ జలాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ, ప్రతిపాదిత బంకచర్ల ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు రావాల్సిన సుమారు 200 టీఎంసీల నీటిని మళ్లించే ప్రమాదం ఉందని, దీనివల్ల ఉత్తర తెలంగాణతో పాటు పెద్దపల్లి ప్రాంతం తీవ్రంగా నష్టపోయి ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావంతో భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాల్లోని దాదాపు రెండు లక్షల మంది ప్రజల భవిష్యత్తు అంధకారంలో ఉందని, తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర నిధుల కేటాయింపులో తెలంగాణపై వివక్ష కొనసాగుతోందని, రైల్వే ప్రాజెక్టులు, పారిశ్రామిక కారిడార్లు, సెమీకండక్టర్ తయారీ కేంద్రాల వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ఇతర రాష్ట్రాలకు తరలించడం సరికాదని హితవు పలికారు. పొరుగు రాష్ట్రాల్లో ఉన్న తరహాలోనే తెలంగాణలోనూ విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా పెద్దపల్లిలో విమానాశ్రయ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను తొలగించాలని కోరారు. తెలంగాణ ప్రయోజనాల రక్షణలో ఎలాంటి వెనకడుగు వేయబోమని, ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ పార్లమెంట్‌లో గళమెత్తారు.

# రేషన్ కార్డులు తొలగిస్తే ఊరుకోం..!

### కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కల్వకుంట్ల కవిత..

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సీరియస్ అయ్యారు. రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరో వైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు.



హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ పథకంతో సొంతింటి కల సహకారం

**వార్డు 17లో ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు**



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 01 (ప్రజా కలం) కోరుట్ల పట్టణంలోని 17 వార్డు గంగంపేట్ లో మండ జ్యోతి ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో జువ్వాడి నర్సింగ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి యజమాని మండ జ్యోతి కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సర కాలంలో తెరాస పాలనలో తెరాస నాయకులు అవినీతికి పాల్పడి పెద్ద పెద్ద భవంతులు కట్టుకున్నరే తప్ప పేదప్రజల అభివృద్ధి గురించి ఆలోచించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక రేవంత్ రెడ్డి ఆలోచన విధానంతో ప్రతి పేదవాడి స్వంత ఇంటి కాల నెరవేర్చి రాష్ట్రంలో ప్రతి మహిళకు పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని వెల్లడించారు. ఇందిరమ్మఇంటి యజమాని మండ జ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో స్వంత ఇంటి కల నెరవేరిందని అన్నారు. కుటుంబం మొత్తం జువ్వాడి నర్సింగరావు,17 వార్డు కౌన్సిలర్ సోగ్రబి ,అక్బర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్, విజయ్, సమిద్, తబ్రేజ్,రమేశ్, రాములు, శ్రీను పాల్గొన్నారు.

## ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**- నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు**



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి, ఏప్రిల్ 01 (ప్రజాకలం)
నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు కోరారు. బుధవారం పట్టణంలోని శ్రీ దుర్గా మెస్ వద్ద కొండగట్టు పాదయాత్రకు వెళుతున్న హనుమాన్ దీక్ష భక్తులకు నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు ఆంజనేయ స్వామి దీక్ష భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు గత పాతిక సంవత్సరాలుగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ ద్వారా ఎంతోమంది పేద ప్రజలను ఆదుకున్నామని వివరించారు. ప్రజలు ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, ఆంజనేయ స్వామి దీక్ష భక్తులు, మున్సిపల్ కౌన్సిలర్ బొడ్ల ఆనంద్, మర్రి నర్సయ్య, కొయ్యల లక్ష్మణ్, ధర్మేందర్, దోమకొండ రమేశ్, గన్నారపు వేణు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా బాధితులకు 'సఖీ' భరోసా

**- సఖీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి,ఏప్రిల్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)
హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రంగంపల్లి లోని సఖీ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి సఖి సెంటర్ లోనే రిజిస్టర్ లను కలెక్టర్ పరిశీలించారు.సఖి కేంద్రంలో కౌన్సిలింగ్ అందుకుంటున్న వివిధ జంటలను కలెక్టర్ సఖి సెంటర్ ద్వారా అందుతున్న సేవలు వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా రిలీఫ్ రావాలని,ఇటువంటి కేసుల పై ఆధిక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.సఖీ సెంటర్ కు వచ్చిన మహిళల సమస్య పరిష్కారానికి కృషి చేసి వారిని రెగ్యులర్ గా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ తెలిపారు.సఖి సెంటర్ కు వచ్చే బాధితులకు అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని,వివిధ కేసులలో అవసరమైన సందర్భంలో న్యాయ సలహా సైతం అందించాలని కలెక్టర్ సూచించారు.గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తూ సఖీ సెంటర్ ద్వారా అందించే సేవల గురించి ప్రచారం కల్పించి,సఖి సెంటర్ కు వచ్చే బాధితుల సంఖ్య పెంచాలని కలెక్టర్ అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# అనుమతులు లేకుండా పునర్నిర్మాణమా..?

**- కోరుట్లలో ఆనంద్ షాపింగ్ మాల్‌పై సంచలన ఆరోపణలు**

**- ప్రమాదాలపై విచారణ జరిపించాలి - మైనారిటీ నాయకుడు మొయిజుర్ రహమాన్**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 01 (ప్రజా కలం) కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్డులో గల ఆనంద్ షాపింగ్ మాల్‌పై తీవ్ర అనుమానాలు, ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. సుమారు నాలుగు సంవత్సరాల క్రితం అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఈ భవనం, ఇటీవల ఎటువంటి స్పష్టమైన అనుమతులు లేకుండానే మరమ్మత్తులు జరగడం అనేక సందేహాలకు దారితీస్తోంది. అయితే గతంలోనే ఈ కాలిపోయిన షాపింగ్ మాల్ భవన మరమ్మత్తుల గురించి పట్టణ మైనారిటీ నాయకుడు మొయిజుర్ రెహమాన్ సమాచార హక్కు చట్టం ద్వారా తేదీ 28/08/2024 న మున్సిపల్ అధికారులను సంప్రదించగా, ఈ భవనానికి మరమ్మత్తుల కొరకు ఎలాంటి అనుమతులు జారీ చేయలేదని వారు స్పష్టం చేశారు.



అనంతరం 27/11/2024 న బిల్డింగ్ ఫిట్నెస్ సర్టిఫికెట్ విషయమై అడిగినప్పుడు, అది ఫైర్ అండ్ సేఫ్టీ డిపార్ట్మెంట్ పరిధిలోకి వస్తుందని మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యపూరిత సమాధానం ఇచ్చి బాధ్యత తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే 06/01/2025 న ఫైర్ అండ్ సర్వీసెస్ శాఖను సంప్రదించగా, వారు కూడా ఇలాంటి భవనానికి ఎలాంటి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వలేదని వెల్లడించడం గమనార్హం. ఈ రెండు శాఖల వారు ఇచ్చిన అసంతృప్తి సమాధానంతో వీళ్ళ నిర్లక్ష్యం బహిర్గతమౌతుంది. ఈ భవనం పునర్నిర్మాణ మరమ్మత్తులకు అసలు ఎవరు అనుమతులు ఇచ్చారు? ఫిట్నెస్ సర్టిఫికెట్, ఎన్.ఓ.సీ లు ఎవరి ద్వారా పొందబడ్డాయి? అనే ప్రశ్నలు మరింత ముదురుతున్నాయి.
ఇదిలా ఉండగా, ఇటీవల మంగళవారం రోజు ఈ భవనంలోని ప్రధాన షట్టర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో కూలిపోవడం కలకలం రేపింది. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే కస్టమర్లు, కార్మికులు భయంతో పరుగులు తీయడం అక్కడి పరిస్థితి ఎంత భయానకంగా మారిందో తెలియజేస్తోంది.
పైకి మెరుగులు దిద్దిన ఈ భవనం లోపల మాత్రం ప్రమాద సంకేతాలు దాగి ఉన్నాయా? భవిష్యత్తులో మరింత పెద్ద ప్రమాదం జరిగే అవకాశముందా? అనే ఆందోళనలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఒక వేళ ఇలాంటి ఘటన మరలా జరిగి ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరిది? అనుమతులు లేకుండా, ఫిట్నెస్, ఎన్ ఓ సి సర్టిఫికెట్లు తీసుకోకుండాఈ నిర్మాణం ఎలా సాగింది? సంబంధిత అధికారులు అవినీతికి పాల్పడి నోటిమాటకు అనుమతులు ఇచ్చారా? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై పూర్తి స్థాయి సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులపై చర్యలు తీసుకోవాలి**

పూర్తిగా అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఆనంద్ షాపింగ్ మాల్ భవనానికి మళ్లీ నిర్మాణ మరమ్మత్తులు చేపడుతున్న సమయంలో భవిష్యత్తులో జరిగే ప్రమాదాలను నివారించేందుకు నేను ముందుగానే సమాచార హక్కు చట్టం ద్వారా సంబంధిత అధికారులను అప్రమత్తం చేయడానికి ప్రయత్నించాను. ఆ సమయంలోనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినప్పటికీ, అధికారుల నుంచి సరైన స్పందన రాకపోగా నిర్లక్ష్యపూరిత సమాధానాలు మాత్రమే లభించాయి.ఇటీవల జరిగిన ప్రమాదం ఈ నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణగా నిలిచింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, దీనిపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించాలి. నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మొయిజుర్ రెహమాన్ కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికి సిపిఐ

**- ఏప్రిల్ ఒకటి నుండి పది వరకు సిపిఐ కార్యక్రమం**

**- కరపత్రం విడుదల సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం - సుతారి రాములు**




జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 01(ప్రజా కలం)దేశంలోని రాష్ట్రంలోని ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికి గడపగడపకు సిపిఐ కార్య క్రమాలలో ముందుకు వెళ్తున్నాం అని సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం సుతారి రాములు తెలిపారు బుధవారం రోజున జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భవన్ లో ఇంటింటికి సిపిఐ సామూహిక నిధి సేకరణ కార్యక్రమం కరపత్రమును విడుదల చేసిన అనంతరం నేతలు మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెలఒకటి నుండి పది వరకు జరిగే సిపిఐ కార్యక్రమం ప్రజలతో కలిసి వారి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వాలపై పోరాటం చేస్తామన్నారు గెలుపు ఓటమితో పని లేకుండా పనిచేస్తున్న సిపిఐ పార్టీ ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ప్రజలను కోరారు అమెరికా ఇరాన్ పై యుద్ధం కారణంగా పెంచిన గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలన్నారు అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూనెలు పప్పులు ఉల్లిగడ్డలు ఇతర తినే వస్తువులు సరఫరా చేయాలన్నారు అలాగే గత అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని చేయూత పథకం కింద అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్లు పెంచి ఇవ్వాలన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నేతలు ఎండి ముక్రం ఎన్నం రాధా, ఎండి మౌలానా, మొయినుద్దీన్, రాంబాబు, సమీర్ బీడీ కార్మికులు, హమాలీ కార్మికులు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## మందుబాబుల 'కిక్కు' దింపిన న్యాయస్థానం

**- జైలు గోడల మధ్య ముగ్గురు..జరిమానాతో 17 మంది**

పెద్దపల్లి,ఏప్రిల్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)
మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్న వారిపై పెద్దపల్లి పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు.ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 22 మందిని బుధవారం స్థానిక కోర్టులో హాజరుపరచగా,న్యాయస్థానం వారికి కఠిన శిక్షలు ఖరారు చేసింది.వివరాల్లోకి వెళ్తే..రోడ్లపై అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడిపే వారిని అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో పట్టుబడిన వారిని జూనియర్ సివిల్ జడ్జి మంజుల ముందు ప్రవేశపెట్టారు.కేసును విచారించిన న్యాయమూర్తి,నేరం రుజువైన ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.శిక్ష పడిన వారిలో పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన గుట్టు తండి,రామగిరి మండలం 8 ఇంక్లైన్ కాలనీకి చెందిన హరిదాస్ రాజ్ కుమార్,పెద్దపల్లి మండలం తుర్కల మద్దికుంటకు చెందిన రేవెల్లి సదానందంలకు మూడేసి రోజుల చొప్పున




జైలు శిక్ష పడింది.అలాగే రాంపెల్లికి చెందిన సయ్యద్ సల్మాన్, మూలసాలకు చెందిన సిరపుల సంతోష్ కుమార్‌లకు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు.వీరితో పాటు పట్టుబడిన మిగిలిన 17 మందికి మొత్తం రూ.22,100జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ తెలిపారు.మద్యం తాగి వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని,నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు శిక్ష తప్పదని ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ హెచ్చరించారు.

## వృద్ధుల సంక్షేమ పథకాల అమలును తనిఖీ చేసిన డైరెక్టర్ శైలజ



జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 01(ప్రజా కలం) తెలంగాణ రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖ సంచాలకులు శైలజ బుధవారం జగిత్యాల జిల్లాలో పర్యటించారు. జిల్లాలో అమలవుతున్న వయోవృద్ధుల సంక్షేమ పథకాలు, ఆశ్రమాల నిర్వహణను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి 'వయోవృద్ధుల పోషణ - పర్యవేక్షణ బిల్లు 2026' కు సంబంధించిన అభినందన సభలో సంచాలకులు పాల్గొన్నారు. పర్యటనలో జిల్లాలోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్ 'ప్రణామం'ను డైరెక్టర్ సందర్శించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని వృద్ధులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తారకరామనగర్‌లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అధికారులకు ఆశ్రమ ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నిధుల మంజూరు హామీ: వృద్ధాశ్రమంలో మరింత మెరుగైన వసతుల కల్పన కోసం అవసరమైన అదనపు నిధులను మంజూరు చేస్తామని ఈ సందర్భంగా శైలజ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీ రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఈ సీనియర్ సహాయకులు చంద్రమోహన్, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ కొండయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాజక్కపల్లి గ్రామంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు



ఎండపల్లి, వెల్గటూర్ ఏప్రిల్ 01 : ( ప్రజా కలం ప్రతినిధి )జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలం రాజక్కపల్లి గ్రామం లో బుధవారం రోజున పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగింది. పశువులు 62 ఆవులు, ఎడ్లు, 79 గేదెలకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను పశువులకు వేయడం జరిగింది. ఈ సంద ర్భంగా సర్పంచ్ దోరిశెట్టి మల్లేశం, ఉప సర్పంచ్ పోచయ్య, వార్డు సభ్యులు బొడ్డు రమేష్, బి తిరుపతి, అలాగే రైతులు పత్తిపాక మల్లేశం, ఎర్రోళ్ల సతీష్, బి పోచయ్య, బోడకుంటి శ్రీకాంత్, రాజయ్య, సత్తయ్య, మోతుకూరి లక్ష్మణ్, బి సంతోష్, రాయలింగు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మండల పశువైద్యాధికారిణి డాక్టర్ పి శ్రీ ప్రియ, సిబ్బంది ఏ సంధ్య, ఆకుల నాగరాజు, కే నారాయణ, ఎం చంద్రయ్య, ఎస్ అంజి పాల్గొన్నట్లు పశువైద్యాధికారిని డాక్టర్ పి శ్రీ ప్రియ తెలిపారు.

## మున్సిపల్ సిబ్బంది కృషి అభినందనీయం

**- మున్సిపల్ చైర్ పర్సన్ మైలారపు లింబాద్రి**



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 01 (ప్రజా కలం) ఆర్థిక సంవత్సరం 2025 - 2026 ప్రాపర్టీ టాక్స్ వసూలులో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవడానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసిన టీం కృషి అభినందనీయమని మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు వచ్చుటకు మెట్ పల్లి మున్సిపాలిటీ అర్హత సాధించినందున మున్సిపల్ చైర్ పర్సన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం స్పందన, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కౌన్సిల్ సభ్యులు అందరూ మున్సిపల్ ప్రాపర్టీ టాక్స్ వసూలుకు కృషి చేసిన రెవిన్యూ ఆఫీసర్, ఇంచార్జ్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వార్డు ఆఫీసర్స్, బిల్ కలెక్టర్లను, టీం సభ్యులను సన్మానించారు.

## కోరుట్లలో కారు కన్సల్టెన్సీ మోసం

**- 4.65 లక్షలతో వ్యక్తి పరారీ, కేసు నమోదు**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి, ఏప్రిల్ 01 (ప్రజాకలం) : కోరుట్లలోని జై భజరంగ్ కారు కన్సల్టెన్సీ వద్ద ఆర్థిక మోసం ఘటన వెలుగులోకి వచ్చింది. వెల్గటూర్ మండలం ముత్తునూరు గ్రామానికి చెందిన మూటపలుకుల వెంకట్ అనే వ్యక్తి, తనను క్యూ న్యూస్ రిపోర్టర్‌గా పరిచయం చేసుకుని, కన్సల్టెన్సీ వద్ద నుంచి రెండు కార్లు తీసుకున్నాడు. మొదటగా తీసుకున్న హ్యుందాయ్ క్రెటా కారుకు సంబంధించి రూ.2.5 లక్షలు, అనంతరం తీసుకున్న గ్రాండ్ ఐ10 కారుకు సంబంధించి రూ.2.15 లక్షలు కలిపి మొత్తం రూ.4.65 లక్షలు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. డబ్బులు అడగడానికి వెళ్లిన కన్సల్టెన్సీ యజమానులు చెక్కపల్లి నవీన్, కుర్ర ఆంజనేయులను వెంకట్ బెదిరించినట్లు సమాచారం. ఈ మేరకు చెక్కపల్లి నవీన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు చీటింగ్, బెదిరింపుల కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ప్రజా కలం
గురువారం, ఏప్రిల్ 2, 2026

# కంగారు పెట్టించిన కగార్

ఆపరేషన్ కగార్... మావోయిస్టులను కంగారు పెట్టేసింది. ఉడుకు రక్తంతో చావంటే తెలియని భయం... వయసు మీరిన తర్వాత వారి వెన్నులో వణుకు పుట్టించింది. మావోయిజంపై ఉక్కుపాదం మోపుతామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలతో భయపెట్టింది. ఆ హెచ్చరికలను మావోయిస్టులు లైట్ తీసుకోవడంతో యాక్షన్ ప్లాన్ అమల్లోకి తెచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వాన్ని భయపెట్టిన మావోలు.. ఇపుడు వాళ్లనే ప్రభుత్వం భయపడే స్థితికి తీసుకొచ్చింది. ఇంతకీ మన దేశంలో మావోల శకం ముగిసినట్టేనా.. వారికి నూకలు చెల్లినట్టేనా..కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆపరేషన్ కగార్ చేపట్టిన భద్రతా బలగాలు అడవులను జల్లెడపట్టింది. కనిపించిన మావోలను కనిపించనట్టుగా మట్టుబెట్టింది. ఆపరేషన్ కగార్... సత్ఫలితాలనిచ్చింది. మావోయిస్ట ఉద్యమంలో తలపండిన ఉద్ధండులు సైతం స్వచ్ఛందలొంగుబాటుకు దారితీసింది. దీంతో ఆ ఉద్యమం కనుమరుగైపోయింది. మావోయిస్టు ఉద్యమం రక్తాక్షరాలతో చరిత్రగా నిలిచిపోయింది. ఒకటే లక్ష్యం... భారత దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని కనుమరుగు చేయాలి. ఉద్యమంలో ఉన్నవారిని జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చి కొత్త జీవితాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. దీంతో తుపాకి వీడండి.. అడవుల్లో అజ్ఞాతం లోంచి జనజీవన స్రవంతిలో కలవండి అనే పిలుపుతో వెనుకాడిన మావోయిస్టులు.ఎన్ కౌంటర్ల తర్వాత స్వచ్ఛంద నిర్ణయంతో మనసు మార్చుకున్నారు. దీంతో మంచి నిర్ణయం తీసుకుని ప్రజాజీవితంలో గడిపేందుకు సమ్మతించారు.మావోయిస్టు ఉద్యమం ఒక చరిత్ర సృష్టించింది. ఇది నిజం. ప్రజా పాలనలో ప్రజా ఉద్యమంగా పురుడుపోసుకున్న మావోయస్టుల పోరాటం ముగిసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అడవుల్లో అన్నలు... పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రం వాళ్లను మోకాళ్లపై నిలబెట్టిందనే చెప్పాలి. ఈ క్రెడిట్ అంతా కేంద్ర హోం మంత్రి అమిత్ షాకే దక్కుతుంది. భద్రతా బలగాలకు ఇచ్చిన స్వేచ్ఛతో పాటు పెరిగిన టెక్నాలజీని ఉపయోగించుకొని మావోయిస్టులను అష్ట దిగ్బంధనం చేశారు. మావోయిస్టు ఉద్యమంలో సుధీర్ఘకాలం పనిచేసిన అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి, దామోదర్ , గంగన్న లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమం ముగిసిందనే చెప్పాలి. మావోయిస్టు పార్టీ చరిత్రలోనే ఇది అత్యంత కీలక లొంగుబాటుగా చెప్పవచ్చు.. మునుపెన్నడూ లేని రీతిలో ఒకేసారి నలుగురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిశారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక కమిటీ అయిన పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ ఎలియాస్ కుమ్మదాదా , కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్ , తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ , రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్న డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. దేవ్‌జీ, సంగ్రామ్‌లకు రూ.25 లక్షల చొప్పున.. మిగిలిన ఇద్దరికీ రూ.20 లక్షల చొప్పున పునరావాసం చెక్కుల్ని అందించారు. రెండు నెలలుగా దేశవ్యాప్తంగా మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. మావోయిస్టులు ప్రభావం ఉన్న మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విప్లవాత్మ మార్పులు చోటుచేసుకున్నాయి. మావోయిస్టుల ఆగ్రనేతలు ఒక్కొక్కరుగా... తమ అనుచరగణంతో పోలీసు ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయారు.నక్సలైట్ల ఘాతుకానికి బలైన వారిలో అత్యధికులు పోలీసులు కాగా? పోలీసులకు సమాచారం అందించారని ఇన్‌ఫార్మర్లపేరుతో అమాయకులను దారుణంగా కాల్చిచంపేశారు మావోలు. ఈ దారుణాలతో ప్రభుత్వాలనే కాదు.. అడవీ ప్రాంత ప్రజానీకాన్ని మావోలు భయపెట్టారు. గ్రామాల్లో ఉన్నవారు భయపడుతూ.. నక్సలైట్లకు ఆశ్రయిం కల్పించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అన్ని సౌకర్యాలను సమకూర్చాలి. సమీప బ్యాంకులను దోపిడీ చేయడం, పారిశ్రామిక వేత్తలను, పెద్ద పెద్ద భూ స్వాములను, కాంట్రాక్టర్లను, రాజకీయ నాయకులను బెదిరించి ఆర్థిక వనరులు సమకూర్చుకునేవారు. మాటవినకుండా.. చందాలు ఇవ్వని వారిని ప్రాణాలు తీసే విషయంలో వెనుకాడేవారు కాదు. మావోయిస్టుల మాట వింటేనే జీవితం.. వ్యతిరేకిస్తే మరణమే శాసనంగా అమలుచేశారు. వరుసగా జరిగిన పరిణామాలతో మావోయిస్ట్ అగ్ర నాయకురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క... పొలిట్ బ్యూరో సభ్యులు మల్లోజుల వేణుగోపాల్... కేంద్ర కమిటీ సభ్యులు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న... అగ్ర నాయకులంతా వరుసగా సుమారు 210 మంది మావోయిస్టులు పోలీసులకు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ తెలంగాణకు చెందినవారే. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఈయన మావోయిస్ట్ ఉద్యమంలో ప్రవేశించి అంచెలంచెలుగా అగ్ర స్థానానికి చేరుకున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పిలుపుతో తుపాకీని పక్కనపెట్టి... అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ప్రజా సమస్యల పరిష్కారంకోసం... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గడగడలాడించిన మావోయిస్టు ఉద్యమం కనుమరుగైపోయింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆంక్షలు... అడవుల్లో గాలింపు చర్యలు... ఆపరేషన్ కగార్ అద్భుత ఫలితాలను ఇచ్చిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇకనుంచి అడవుల్లో తుపాకుల అలజడి వినపడదు. ఎదురు కాల్పులు జరగవు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు హెచ్చరికలుండవు.. అడవుల్లో ఎదురుకాల్పుల్లేని ప్రశాంత వాతావరణం నెలకొల్పాలనుకున్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందనే అభిప్రాయం పోలీసుల్లో వ్యక్తమవుతోంది.

# వృద్ధులను వృద్ధాశ్రమంలో చేర్పించిన కరీంనగర్ పోలీసులు



కరీంనగర్ ప్రతినిధి ఏప్రిల్ 01 (ప్రజా కలం)

వివిధ ప్రాంతాల్లో ఉన్న వృద్ధులను వృద్ధాశ్రమంలో చేర్పించారు కరీంనగర్ రూరల్ పోలీసులు .. వారి సేవలను గుర్తించిన స్థానికులు రూరల్ పోలీసులను అభినందిస్తున్నారు. వివరాలలోకి వెళితే... మెట్ పల్లి మండలంలోని వెల్లుల్లకు చెందిన శ్రీరామ్ అంజయ్య, పెద్దపల్లి జిల్లాకు చెందిన మంథని కి చెందిన బూర్గు రాజయ్య, కరీంనగర్ దేశరాజుపల్లి వాసి ఆవుదుర్తి సతీష్ లు వారి గ్రామాల్లో అనాథలుగా ఉన్నారని తిండి లేక ఇబ్బంది పడుతూ ఆరోగ్యం క్షీణించినందున కరీంనగర్ రూరల్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో ముగ్గురిని కరీంనగర్ కు తరలించి అక్కడ ఆసుపత్రులలో పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారి బాగోగులు చూసుకోవడం కొరకు కరీంనగర్ రూరల్ పి ఎస్ పరిధిలో ఉన్న విబి ఫౌండేషన్ ( వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమం) నిర్వాహకులు వీరమాధవ్ కు అప్పగించారు. అంతేకాకుండా వారికి మందులు, పండ్లు అందించి పోలీసు వాహనంలో తీసుకొని వెళ్లి ఆశ్రమంలో చేర్పించినట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.ఎవరైనా అనాథలు ఉంటే కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని సిఐ నిరంజన్ రెడ్డి వెల్లడించారు.ఈ సందర్భంగా వారిని అనాథశ్రమంలో చేర్చడానికి సహకరించిన ఎస్సైలు నరేశ్, లక్ష్మా రెడ్డి, పోలీస్ స్టే షన్ సిబ్బందిని సీఐ నిరంజన్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా రెడ్ క్రాస్ సెక్రటరీ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# న్యాయవాదుల సంక్షేమానికి కృషి

## - మెట్ పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 01(ప్రజా కలం) న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని మెట్ పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామిరెడ్డి అన్నారు. మెట్ పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నల్లా రాజేందర్, కార్యవర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేసారు. ఈ నెల 30 న జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన బార్ అసోసియేషన్ కార్యవర్గం చేత ఎన్నికల అధికారులు జిల్లా వెంకటేశ్వర్లు, ఏలేటి శ్రీనివాస్ రెడ్డి, పుప్పాల భానుమూర్తి లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్బంగా నూతన అధ్యక్షులు రాంరెడ్డి మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అభివృద్ధి తో పాటూ, న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం పూర్వ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి బార్ అసోసియేషన్ కి సంబందించిన రికార్డులు అందజేశారు. అనంతరం ప్రెసిడెంట్ రాంరెడ్డిని ఎన్నికల అధికారులను, న్యాయవాదులు




సన్మానించారు.

ఈ సన్మాన కార్యక్రమంలో న్యాయవాదులు రాజ్ మహ్మద్, కొండా ప్రవీణ్ కుమార్, ఏలేటి నరేందర్ రెడ్డి, పుప్పాల రాంభూపాల్, పోలకొండ దయాకర్ వర్మ, బద్దం లక్ష్మారెడ్డి, గడ్డం శంకర్ రెడ్డి, బోడ లక్ష్మణ్, అలాల సత్యనారాయణ, పసునూరి శ్రీనివాస్, పడిగేల శ్రీనివాస్, రాంపల్లి జగన్, బిగుల్లా శంకర్, మార్క వంశీకృష్ణ, ద్యావని సత్యనారాయణ, వెల్మల స్వప్న రావు ఉన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

## - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి,ఏప్రిల్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రజల చిరకాల వాంఛ అయిన అభివృద్ధి పనులను నాణ్యతతో,నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన ఓదెల,జమ్మికుంట మండలాల్లో విస్తృతంగా పర్యటించి,క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు.ఓదెల మండలం రూప్ నారాయణపేట మరియు జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మధ్య మానేరు వాగుపై నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే సందర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.80 కోట్లు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు.పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకూడదని,నిబంధనల ప్రకారం గడువులోగా పూర్తి చేసి ప్రజల రవాణా కష్టాలను తీర్చాలని ఇంజనీర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అనంతరం పొత్కపల్లి గ్రామ శివారులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కూడా ఆయన తనిఖీ చేశారు.పొత్కపల్లి నుండి కాల్వ శ్రీరాంపూర్ వరకు రూ. 27 కోట్లతో నూతనంగా చేపట్టిన డబల్ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.రోడ్డు నిర్మాణంలో నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలని,ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు సూచించారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది,ఆ ఫలితాలు ప్రజలకు త్వరగా అందాలని ఆయన పేర్కొన్నారు.

**ఆలయంలో ప్రత్యేక పూజలు-చండీయాగం**

అభివృద్ధి పనుల పరిశీలన అనంతరం, ఓదెల మండలం రూపునారాయణపేట గ్రామంలోని శ్రీ శివ పంచాయతన అభయాంజనేయ దేవాలయ 10వ వార్షికోత్సవ వేడుకల్లో విజయరమణ రావు దంపతులు పాల్గొన్నారు.లోక కల్యాణార్థం ఆలయంలో నిర్వహించిన అవాహిత దేవత ఆరాధన,అగ్ని ప్రతిష్ఠ,నిత్యపూర్ణహుతి కార్యక్రమాల్లో పాల్గొన్నవారు,కుటుంబ సమేతంగా చండీయాగం మరియు హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ పర్యటనలో మూల ప్రేమ సాగర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు,వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు,మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ మండల అధ్యక్షులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

## - అసెంబ్లీ అధ్యక్షులు ముత్యాల నరేష్ ముదిరాజ్

## - ఏప్రిల్ 15న పెద్దపల్లిలో అసెంబ్లీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్




పెద్దపల్లి,ఏప్రిల్ 0:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో పటిష్టం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పెద్దపల్లి అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల నరేష్ ముదిరాజ్ స్పష్టం చేశారు.బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బొంకూరి అవినాష్‌తో పాటు యువజన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిర్వహించిన అసెంబ్లీ స్థాయి సమీక్షా సమావేశంలో ముత్యాల నరేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.పార్టీ బలోపేతానికి త్వరలోనే గ్రామ,మండల,అసెంబ్లీ కమిటీలను వేయనున్నట్లు వెల్లడించిన ఆయన,రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావును కోరినట్లు తెలిపారు.అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే ఆదేశాల మేరకు యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు వదలండి-మైదానంలోకి రండి అనే నినాదంతో ఏప్రిల్ 15న పెద్దపల్లి ప్రభుత్వ కళాశాల మైదానంలో అసెంబ్లీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.నియోజకవర్గంలోని క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు గుమ్మడి ప్రసాద్,పిరంగి రాజు,అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఎంచర్ల తిరుమలేశ్ యాదవ్,ప్రధాన కార్యదర్శి ఆయుబ్,కార్యదర్శులు అభినయ్ గౌడ్,కోదవత్రి మధుకర్,పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రవణ్,మండల అధ్యక్షులు జడల రాజు,సిరిసెటి రాహుల్,ఒర్రె అజయ్ యాదవ్,దేవేందర్ రెడ్డి,నాయకులు అరగొండ రాజ్ కుమార్,వెలిశాల రాకేష్,రాకేష్ యాదవ్,గుర్రాల వాసు,స్వామి రాజ్ యాదవ్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గుల్లకోట అంగన్ వాడి కేంద్రం 2 లో బాలింతల కు బాలామృతం గుడ్లు పంపిణీ

## - పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్



ఎండపల్లి ఏప్రిల్ 01 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో అంగన్ వాడి కేంద్రం 2 లో బాలామృతం, గుడ్లు పంపిణి చేసిన గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ పంచ్ మాట్లాడుతూ 6 నెలల 3 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు ఒక్క బాలామృతం పాకెట్,16 గుడ్లు ప్రతినెల ఇవ్వడం జరుగుతుందని సర్పంచ్ అన్నారు. అంగన్ వాడి టీచర్ ఆధ్వర్యం లో గర్భవతులు, బాలింతలు అందరూ కలిసి ఈ సందర్భంగా సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో అంగన్ వాడీ టీచర్ భూసారపు భూలక్ష్మి, ఆయా బాయిగారి కవిత, గర్భవతులు, బాలింతలు, చిన్న పిల్లలు పాల్గొన్నారు.

# కొత్తపేట గ్రామం లో ఈసీసీఈ కేంద్రం లో టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేసిన సర్పంచ్

## - బాల్య సంరక్షణ విద్య కేంద్రంలో సరుకులు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి




ఎండపల్లి, ఏప్రిల్ 01 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామం లో ఈసీసీఈ కేంద్రం 2, 3 లో సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై (టి హెచ్ ఆర్) టేక్ హోమ్ రేషన్ సరుకులు 6 నెలల వయస్సు పిల్లల నుండి 3 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఈసీసీఈ కేంద్రం నుండి ఇంటికి టేక్ హోమ్ రేషన్ సరుకులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా బుధవారం రోజున పిల్లల తల్లి దండ్రులకు 1 బాలా మృతం, 16 కోడి గుడ్లను అంద జేశారు. అలాగే గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి మాట్లాడు తూ ప్రభుత్వం చిన్న పిల్లల ఆరో గ్యం పట్ల చాలా శ్రద్ధ తీసు కుంటుందని ప్రతినెలా టి హెచ్ ఆర్ బాలామృతం, కోడి గుడ్లను అందిస్తుందని. తెలిపినారు. ఈ కార్యక్రమం లో బాల్య సంరక్షణ విద్య కేంద్రం 2,3 టీచర్స్ నవనీత, స్వప్న, అన్నపూర్ణ, ఆయా, ఆశా కవిత, ప్రమీల, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## - మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




ధర్మారం,ఏప్రిల్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

గిరిజన విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.బుధవారం ధర్మారం గిరిజన మినీ గురుకులంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ఆయన అదనపు తరగతుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ




సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో తాను ఇక్కడ పర్యటించినప్పుడు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి,కలెక్టర్ సహకారంతో ఇప్పటికే డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం 5వ తరగతి వరకు ఉన్న ఈ మినీ గురుకులాన్ని 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని,ప్రభుత్వ అనుమతులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో 200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులు వారం రోజుల్లో ప్రారంభమవుతాయని,ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాల పిల్లలందరికీ ఒకే చోట ఉన్నత చదువులు అందుతాయని వివరించారు.గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలను ప్రస్తుతం ప్రతి నెలా 7వ తేదీ లోపు చెల్లిస్తున్నామని తెలిపారు.

ధర్మారంలో ఐటీఐ పనులు త్వరలో ప్రారంభమవుతాయని,డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,పీఎం జన జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ కింద కోటీ 10 లక్షల రూపాయలతో హాస్టల్ భవనం,తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నామని,పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వారు ధర్మారంలోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య,తహసిల్దార్ శ్రీనివాస్,ఇతర ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాల గడువు పొడిగింపు

**- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి**




పెద్దపల్లి,ఏప్రిల్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలోని అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉపకార వేతనాల దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ప్రభుత్వ మరియు ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ మరియు మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హత కలిగిన విద్యార్థులందరూ www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ కొత్త లేదా పునరుద్ధరణ దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకునేలా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు,ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ఫిర్యాదు దారులతో నిండి పోయిన భైంసా క్యాంపు ఆఫీస్

**- జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ను కలిసి సమస్యలను విన్నవించుకునేందుకు భారీగా పోటెత్తిన ఫిర్యాదు దారులు**



నిర్మల్ ఏప్రిల్ 01 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) భైంసా క్యాంపు ఆఫీస్ లో బుదువారం నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా ఫిర్యాదు దారులు లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలను కలిసి సమస్యలను విన్నవించుకునేందుకు ప్రజలు భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయానికి పోటెత్తారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎస్పీకి తెలియజేయాలనే ఉద్దేశంతో భైంసా సబ్ డివిజన్ లోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో వారి సమస్యలను విన్నవించేందుకు భైంసా క్యాంపు రావడం జరిగింది. దీంతో క్యాంపు ఆఫీస్ మొత్తం ఫిర్యాదు దారులతో నిండి పోయింది.ఈ సందర్భంగా లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రతి ఒక్క ఫిర్యాదుదారుడి సమస్యను ఎంతో ఓర్పుతో, శ్రద్ధగా విని,సంబంధిత పోలీసు అధికారులకు వెంటనే విచారణ జరిపి, న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం లేకుండా పనిచేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను నేరుగా వినిపించుకునే అవకాశం కల్పించినందుకు ఫిర్యాదుదారులు ఆనందం వ్యక్తం చేస్తూ లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.**



నిర్మల్ ఏప్రిల్ 01 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ఈనెల నాలుగవ తేదీన (శనివారం) ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన, ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికైన కౌన్సిలర్లకు పార్టీల వారిగా సీటింగ్ ఏర్పాటు చేసి, త్రాగునీరు అందించాలని పేర్కొన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టి, తొలిసారి ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చినందున అదనపు కలెక్టర్ ను, మున్సిపల్ కమిషనర్, తదితర అధికారులు శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో సీపీవో జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# దందాల చరిత్ర నీది.. ప్రగతి ప్రస్థానం ఎమ్మెల్యేది

**- రామగుండం అభివృద్ధిపై బురదజల్లితే సహించేది లేదు**

**- కౌశిక్ హరిపై మేయర్ మహంకాళి స్వామి ధ్వజం**

పెద్దపల్లి,ఏప్రిల్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధీ)

రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాగూర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని,అనవసర విమర్శలకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని రామగుండం మేయర్ మహంకాళి స్వామి హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ రామగుండం ప్రాంతాన్ని వేల కోట్లతో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తుంటే, ఓర్వలేక ఎమ్మెల్యేపై బురద జల్లేందుకు కౌశిక్ హరి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రూ. 80 కోట్లతో ఐటిఐని ఏటిసిగా మార్చి యువతకు ఉపాధి శిక్షణ ఇప్పించడం,నగరం నడిబొడ్డున అత్యాధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం ఎమ్మెల్యే దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రోడ్లు,డ్రైనేజీ పనులు ముమ్మరంగా సాగుతుంటే,ఆ అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక కౌశిక్ హరి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,సోమారపు సత్యనారాయణ ప్రజల కనీస అవసరాలను పట్టించుకోలేదని,కనీసం తాగడానికి మంచినీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉండేవారని విమర్శించారు.



అప్పట్లో ప్రజల పక్షాన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ అనేక ధర్నాలు చేసినా,ఈ కౌశిక్ హరి నోరు మెదపలేదని,కారణం మాజీ ఎమ్మెల్యే నుండి ప్రతి నెలా ఇసుక,బూడిద దందాల సొమ్ము జేబు నిండా అందడమేనని ఎద్దేవా చేశారు. బూడిద దొంగ,ఇసుక దొంగగా పేరొందిన వ్యక్తి,జెన్కో భూములను కబ్జా చేసిన వ్యక్తి ఇవాళ నీతులు మాట్లాడటం హాస్యాస్పదమని దుయ్యబట్టారు.

ప్రజా ప్రభుత్వంలో అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన సాగుతుంటే,అపోహలు సృష్టించే వారికి ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. ఇకపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని,హెచ్చరికల సమయం దాటిపోయిందని,జరిగే పరిణామాలకు కౌశిక్ హరియే బాధ్యత వహించాలని మేయర్ మహంకాళి స్వామి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 2 లక్షల 37 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ప్రణాళిక

**- రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం**

**- రబీ ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**



ఖమ్మం, ఏప్రిల్ 01(ప్రజా కలం న్యూస్ )

రబీ (యాసంగి) సీజన్ 2025-26 నందు ఖమ్మం జిల్లాలో 2 లక్షల 37 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. అదనపు కలెక్టర్, బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్ 2025-26 లో ఖమ్మం జిల్లా పరిధిలో 2 లక్షల 37 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా ఉంటుందని, రైస్ మిల్లర్లు కనీసం లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దింపుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ తెలిపారు.రైస్ మిల్లర్ల నుంచి గన్ని సంచుల సేకరణ సమయంలో చెక్ చేసి నాణ్యత అంశం సర్టిపై చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు పంపిణీ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. మిల్ పాయింట్ వద్దే గన్ని సంచుల నాణ్యత పరిశీలన ఉంటుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం రవాణా సంబంధించి పెండింగ్ బకాయిల బిల్లు సమర్పించడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా రైస్ మిల్ సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంగళ తోరణాలతో ప్రారంభమైన అంకమ్మ జాతర

**కార్యక్రమంలోపాల్గొన్న మాజీ ఎంపీపీ,సర్పంచ్ గొర్ల ప్రభాకర్, మాజీ సర్పంచ్ దొడ్డ నిర్మల,మరియు జాతర కమిటీ సభ్యులు**

తల్లాడ ఏప్రిల్ 01, ప్రజా కలం న్యూస్

అన్నారుగూడెంలో ఐదు రోజులు అంకమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో మొదటి రోజు బుధవారం ఉదయం మంగళ తోరణాలతో,విగ్నేశ్వర పూజతో ఎంతో వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొర్ల ప్రభాకర్ లు పాల్గొని తోరణపాకు కట్టి దేవాలయానికి అలంకరించారు. అనంతరం వారు జాతర కమిటీ సభ్యులతో మాట్లాడి జాతర సజావుగా జరిగేలా చూడాలని కమిటీని వారు కోరారు. అంతేకాకుండా రాత్రి జరగబోయే అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా జరగాలని ఎక్కడ అవాంతరానీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు అంకమ్మ జాతర కమిటీ వారియర్స్ పర్యవేక్షణ ఉండాలని ఈ ఐదు రోజులు జరిగే జాతర జిల్లాలోనే మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చేలా ఉండాలని కమిటీకి వారు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్,మరియు తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, అన్నారుగూడెం గ్రామ సర్పంచ్ గొర్ల ప్రభాకర్, ఆ గ్రామ మాజీ



సర్పంచ్ దొడ్డ నిర్మల, జాతర కమిటీ సభ్యులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, మారెళ్ళ దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, దొబ్బల శ్రీనివాసరావు, పేరసాని నరసింహారావు, దుగ్గినేని సత్యనారాయణ, దొబ్బల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు,రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధి చేసి చూపిస్తా...

**- తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు(చిన్నబ్బాయి)**



తల్లాడ/ఏప్రిల్ /1 ప్రజా కలం న్యూస్

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధి చేసి చూపిస్తానని తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు అన్నారు. ఎన్నో సంవత్సరాలగా గ్రామంలో మంచినీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందిని తెలుసుకొని సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి) గ్రామంలోని నారాయణపురం, గొల్లగూడెం రోడ్ లోని బోరు, పైప్ లైన్లను మరమ్మతులు చేసి నూతన బోర్లను, పైపులను లైన్లను బిగించి ప్రజలకు మంచినీటి సరఫరాను నిరంతరంగా అందించను చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఉన్న తమ దగ్గరకు వచ్చి నేరుగా చెప్పవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌జీఓల స్వేచ్ఛకు భంగం కలిగించొద్దంటూ పార్లమెంట్ వద్ద నిరసనలో పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి




ఖమ్మం ఏప్రిల్ 01(ప్రజా కలం న్యూస్ ) విదేశీ విరాళాల నియంత్రణ చట్టం లో ప్రతిపాదిత మార్పులు ఎన్‌జీఓల కార్యకలాపాలకు ఆటంకం కలిగించకుండా ఉండాలని కోరుతూ.. కాంగ్రెస్, విపక్ష పార్టీల ఎంపీలతో కలిసి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం పార్లమెంట్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. 2024-25, 2026 సవరణ బిల్లుల్లోని కఠిన నిబంధనలు ఎన్‌జీఓల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. పారదర్శకతతో పాటు స్వచ్ఛంద సంస్థల కార్యాచరణ స్వేచ్ఛను కాపాడే విధంగా చట్టంలో సవరణలు చేయాలని కోరారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తీరు మారాలని, సంస్థల స్వేచ్ఛను హరించేలా ఉండకూడదని డిమాండ్ చేశారు.

## జిల్లా మహిళా సంఘాలకు అవార్డులు లభించడం గర్వకారణం

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్ ఏప్రిల్ 01 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా మహిళా సంఘాలకు ఇటీవలి రాష్ట్ర స్థాయి అవార్డులు లభించినందుకు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ను ఆ శాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను, సిబ్బందిని శాలువాలతో సన్మానించి, అభినందించారు. అధికారులు, సిబ్బంది చేసిన కృషి గొప్పదని హర్షం వ్యక్తం చేశారు. మున్ముందు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ, జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడపాలని అన్నారు. అవార్డులు సాధించేలా ప్రోత్సహించినందుకు కలెక్టర్ కు అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక యంత్రాలతో వ్యవసాయ పనులు సులువు

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్ ఏప్రిల్ 01 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

వ్యవసాయ పనుల్లో ఆధునిక యంత్రాల వాడకం వల్ల వ్యవసాయ పనులు సులభతరం అవుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో, సారంగాపూర్ మండలం కౌట్ల (బి) రైతు సంఘానికి 3 లక్షల 85 వేల సబ్సిడీతో మంజూరైన డ్రోన్, పనిముట్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ పనుల్లో ఆధునిక వ్యవసాయ పనిముట్లు భాగస్వామ్యం చేయడం వల్ల రైతులు ఎంతో లాభం పొందుతారని, పనులు అన్ని తక్కువ కాలంలో, తక్కువ శ్రమతో పూర్తవుతాయని పేర్కొన్నారు. దీనివల్ల రైతుకు సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. మరింతమంది రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, రైతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ఖమ్మంలో జన్మదినోత్సవం

ఖమ్మం, ఏప్రిల్ 01( ప్రజా కలం న్యూస్ ) ఖమ్మం నగరంలోనే బుధవారం ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్‌లో మాదిగ సంఘాలు కుక్కల రామకృష్ణ (ఆర్కే) అధ్యక్షతన సామాజిక సంక్షేమ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి జన్మదిన పురస్కరించుకుని ఘనంగా నిర్వహించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్, దళితరత్న తెలంగాణ మాదిగ హక్కుల దండోరా టీఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొని, కేకును కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంపించి అందరినీ సంతోషపెట్టారు. ఈ కార్యక్రమంలో పగిడి ముక్కుల విజయ్ కుమార్, తూరిగంటి దశరథ్ టీచర్, దూభాషి శ్రీను (రైల్వే ఉద్యోగి), టీఎంహెచ్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడిశాల వెంకన్న మాదిగ, పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ జంగం వెంకయ్య మాదిగ, ఖమ్మం నగర కన్వీనర్ జంగం నగేష్, గోపి సుందరయ్య, జిల్లా గోపిరాజు నాలుగైదు డివిజన్ల కుల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం జలవనరులు సీఈ మంగళంపూడి వెంకటేశ్వరరావుకు అదనపు బాధ్యతలపై శుభాకాంక్షలు



ఖమ్మం, ఏప్రిల్ 01(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగరంలోని బుధవారం జిల్లా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్‌గా సీఈ అదనపు బాధ్యతలు స్వీకరించిన మంగళంపూడి వెంకటేశ్వరరావు,ని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓఏ) ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రిలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఓఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి. విజయ్ కుమార్, టీజీఓఏ కార్యవర్గ సభ్యులు మేకల గోపాలకృష్ణ, మోదుగు వెంకటేశ్వర్లు, బి. హరీష్, సతీష్, భాస్కర్, డాక్టర్ బూరుగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ 75% రాయితీతో పశుగ్రాస విత్తనాలు

**- పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

**- మండల పశువైద్యాధికారి డా. రాజేందర్ సూచన**

ఏప్రిల్ 01, ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ / వర్ధన్నపేట):



పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు శుభవార్త. 75 శాతం రాయితీతో పశుగ్రాసం (జొన్న రకం) విత్తనాలు పశువైద్య కేంద్రాలు, పశు ఉపకేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎం. రాజేందర్ తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పశువులకు పచ్చి మేత కొరత లేకుండా ఉండేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పశుగ్రాస విత్తనాలను తీసుకెళ్లి పశువులకు సమృద్ధిగా మేత అందించాలని సూచించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని, ప్రతి రైతు ఈ రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రైవేట్ బస్సులో మంటలు..ప్రయాణికులు సురక్షితం

విజయవాడ : నగరంలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలో భారీ ప్రమాదం తప్పింది. రావులపాలెం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉండటంతో ఒక్కసారిగా భయాందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే, డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడటంతో పెను ముప్పు తప్పినట్లయింది. రావులపాలెం నుంచి బయలుదేరిన ఈ బస్సు విజయవాడ బస్టాండ్ ఎదురుగా వెళ్తుండగా, ఇంజిన్ భాగం నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. బ్యాటరీ టెర్మినల్స్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను కిందకు దించేశారు. సమాచారం అందుకున్న విజయవాడ ఫైర్ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అటు అధికారులు, ఇటు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## పట్టాలు తప్పిన మిల్క్ ట్యాంకర్ బోగి

**విజయవాడ నుండి చెన్నై, తిరుపతి రైలు మార్గం లో రైళ్ళు ఆలస్యం**

నెల్లూరు : నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొమ్మలపూడి రైల్వే స్టేషన్ సమీపంలో పాల ట్యాంకర్ లతో వెళుతున్న వ్యాగెన్ లు ట్రాక్ పై అదుపుతప్పి ఓ వైపుకు ఒరిగిపోయాయి. దీంతో పలు రైళ్ల రాకపోకలు కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విజయవాడ నుంచి తిరుమలకు పాలు తీసుకెళుతున్నట్టు సమాచారం. రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెట్టారు.

## చోరీ ఘటనలో ఇద్దరు అరెస్టు

గుంటూరు : లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోనీ ఇందిరా ప్రియదర్శిని కాలనీ లో ఈ నెల 7 వ తేదీన తాళం వేసిన ఇంటిని దొంగలు దోచుకున్నఘటనలో నిందితులను పట్టుకున్నామని జిల్లా, ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ పట్టపగలు ఇంటి తాళం విరగకొట్టి బీరువా నీ బద్దలు కొట్టి 246 గ్రాముల బంగారం కొంత నగదును దోచుకున్నారు. దర్యాప్తు చేపట్టిన లాలపేట పోలీసులు... ఇమ్రాన్( 40), రషీద్ (38) ఈ దొంగతనం చేసినట్లుగా గుర్తించారు. ఇద్దరు దొంగలు ఉత్తరప్రదేశ్లోని గజియాబాద్ జిల్లాకు చెందిన వారు. వీరి దగ్గర నుంచి 246 గ్రాముల బంగారం.. 136 గ్రాముల గోల్డ్ పీసెస్. 132 చిన్న చిన్న వజ్రాలు నాలుగు లక్షల రూపాయల నగదుని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. వీరిపై ఇదివరకే దొంగతనం కేసులు ఉన్నాయి బెయిల్ పై కోర్టుకు హాజరవుతూ మరల దొంగతనలకు పాల్పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్లో రాజమండ్రి, పెద్దాపురం, యానం,పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగతనం చేసిన డబ్బులతో సౌదీ,గోవా, ముసోరి, ప్రాంతాలకు విహారయాత్రలకు వెళుతూ ఉంటారని అయన అన్నారు.

## కొత్తగూడ శ్మశాన వాటిక వద్ద ఉద్రిక్తత

కొండాపూర్ : పూర్వికుల జ్ఞాపకాలను ఎలా చెరిపేస్తారంటూ కొత్తగూడ గ్రామస్థులు హిందూ శ్మశాన వాటికి వద్ద ఆందోళనకు దిగారు. రోడ్డు విస్తరణలో భాగంగా కొత్తగూడ శ్మశాన వాటిక తొలగింపు కోసం జీహెచ్ఎంసీ, హైడ్రా బృందాలు పోలీస్ బందోబస్తు తో కూల్చివేతకు రంగం సిద్ధం చేసుకుంది. సమాచారం అందుకున్న గ్రామస్థులు శ్మశాన వాటిక వద్దకు చేసుకుని పూర్వికుల జ్ఞాపకాలను ఎలా తొలగిస్తారంటూ ఆందోళనకు దిగారు. శ్మశాన వాటికను తలగించవద్దంటూ వేడుకుంటున్నారు. కుటుంబీకులకు శ్మశానం దేవాలయంతో సమానమేనని, పూర్వికుల సమాధులను ఎలా కులుస్తారంటూ అడ్డుకుంటున్నారు.

## అస్తి పన్ను బకాయిలు... జయలలిత ఇల్లు సీజ్

హైదరాబాద్:తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలత కు చెందిన హైదరాబాద్లోని ఇల్లు జీహెచ్ఎంసి అధికారులు సీజ్ చేశారు.నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ఈ భవనంపై ఆస్తి పన్ను బకాయిలు ఉండటంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు రూ.1.60 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ విషయంపై పలుమార్లు జయలలిత కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో చివరికి భవనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

# బ్రెయిన్ అన్యూరిజంపై విజయం

## రోగికి పునర్జన్మ ప్రసాదించిన న్యూరో సర్జన్లు



హనుమకొండ మార్చి 31 (ప్రజా కలం ప్రతినిధి):

ఆకస్మికంగా వచ్చే తీవ్రమైన తలనొప్పిని నిర్లక్ష్యం చేయడం ప్రాణాంతకం కావచ్చుననిమలక్పేట యశోద హాస్పిటల్ వైద్యులు హెచ్చరించారు. అత్యంత క్లిష్టమైన 'బ్రెయిన్ అన్యూరిజం' (మెదడులోని రక్తనాళం ఉబ్బి పగిలిపోవడం) సమస్యతో ప్రాణాపాయ స్థితిలో చేరిన ఒక 49 ఏళ్ల వ్యక్తికి అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి వైద్య బృందం ప్రాణాలను కాపాడింది. మంగళవారం రోజున హనుమకొండ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్రమైన తలనొప్పితో ఆసుపత్రిలో చేరిన రోగికి పరీక్షలు నిర్వహించగా,మెదడులోని ప్రధాన రక్తనాళం ఉబ్బి(అన్యూరిజం) పగిలిపోవడం వల్ల రక్తస్రావం (హేమరేజ్ ) జరిగినట్లుగుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కన్సల్టెంట్ న్యూరో సర్జన్డాక్టర్ జయానంద్ సుధీర్ నేతృత్వంలోని వైద్య బృందం తక్షణమే స్పందించింది. అన్యూరిజం నిర్మాణం సంక్లిష్టంగా ఉండటంతో సాధారణ పద్ధతులు సాధ్యం కాలేదు. దీనితో వైద్యులు 'ఓపెన్ బ్రెయిన్ మైక్రో సర్జికల్ క్లిప్పింగ్' నిర్వహించాలని నిర్ణయించారు. టైటానియం క్లిప్పు ఉపయోగించి Stroke: TimBrain L పగిలిన రక్తనాళాన్ని విజయవంతంగా మూసివేసి, మెదడుకు రక్త ప్రసరణను పునరుద్ధరించారు. ఈ చికిత్సలో డాక్టర్ వంశీ రెడ్డి బృందం కీలక పాత్ర పోషించింది. అత్యాధునిక వైద్య సదుపాయాలు,నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో రోగి ఎటువంటి నరాల సంబంధిత లోపాలు లేకుండా వేగంగా కోలుకున్నారు. సర్జరీ జరిగిన కేవలం ఐదు రోజుల్లోనే రోగి స్వయంగా నడుచుకుంటూ డిశ్చార్జ్ కావడం విశేషం. మలక్పేట యశోదలో అందుబాటులో ఉన్న 24/7 న్యూరో క్రిటికల్ కేర్ వసతుల వల్లే ఇలాంటి క్లిష్టమైన కేసులు సాధ్యమవుతున్నాయని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ గోరుకంటి పవన్ యూనిట్ హెడ్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## అడ్డగట్ట మన్విత్ మృతి పట్ల సానుభూతి వ్యక్తపరిచిన ఎమ్మెల్యే నాగరాజు

**వెంకట్రావుపల్లెలో కుటుంబ సభ్యులకు పరామర్శ - ధైర్యం చెప్పిన ప్రజాప్రతినిధులు**



ఏప్రిల్ 01 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల పరిధిలోని వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన అడ్డగట్ట అశోక్ కుమారుడు మన్విత్ (6) ఇటీవల ప్రమాదవశాత్తు ట్రాక్టర్ క్రింద పడి మరణించిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో నేడు గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కేఆర్ దిలీప్ రాజ్ మన్విత్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ కుల్ల పావని-యకాంతం, ఉప సర్పంచ్ మహేందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వలి భాష, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్ బెజ్జం పాపారావు, తిరుపెల్లి వాణి-కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న, రాజేష్ కన్నా, యాదగిరి, రాములు, కర్ర హరీష్ రెడ్డి, జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, పత్రి భాను ప్రసాద్, కత్తి సుధీర్ గౌడ్, సతీష్, చిరంజీవి, ప్రశాంత్, గంగరాజు, చేరాలు తదితరులు కూడా ఈ పరామర్శ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పాము కాటు తో మహిళ మృతి

**- తాడిచెర్ల పిహెచ్ సి లో అందని ప్రథమ చికిత్స**

**- 24 గంటల వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్**

మల్హర్, ఏప్రిల్ 01 ప్రజాకలం ప్రతినిధి



పాముకాటుతో ఓ మహిళ మృతి చెందిన విషాదకర సంఘటన మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తాడిచర్ల గ్రామానికి చెందిన గంగుల రాదక్క (54) బుధవారం తెల్లవారుజామున ఐదు గంటలకు ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్న క్రమంలో గుర్తు తెలియని పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు తాడిచెర్ల పిహెచ్ సి కి తరలించగా ఆ సమయంలో ఆసుపత్రికి తాళం వేసి ఉండడంతో పిహెచ్ సి లో ఉన్న అంబులెన్సు లో మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు తెలపడంతో మెరుగైన వైద్యం కోసం గోదావరిఖని తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. అందరితో ఎంతో ఆప్యాయంగా ఉండే రాదక్క పాము కాటు తో మృతి చెందడంతో తాడిచెర్ల గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.

**పేరుకే 24 గంటల ఆసుపత్రి ఆచరణలో మాత్రం శూన్యం**

తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల ఆసుపత్రి అని చెప్పడమే తప్ప ఆచరణలో మాత్రం అమలు కావడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. 24 గంటల ఆసుపత్రి అని పిహెచ్ లో అంబులెన్సు ఏర్పాటు చేసిన అధికారులు అందుకు తగిన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఓ వైపు సిఎస్ఆర్ నిధులతో సైతం ఏర్పాటు అయిన డిస్పెన్సరీ సిబ్బంది సైతం పిహెచ్ సి లో కొనసాగుతున్న స్థానిక ప్రజలకు అత్యవసర సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొందని మృతురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడిచర్ల పిహెచ్ సి లో ప్రథమ చికిత్స అంది ఉంటే తమ తల్లి బతికేదని మృతురాలి కుమారుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు తాడిచర్ల పిహెచ్ సి లో వైద్య సదుపాయాలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**- రక్తదానానికి భారీగా తరలివచ్చిన యువకులు**




హనుమకొండ ఏప్రిల్ ఒకటి ప్రజా కలం ప్రతినిధి

హనుమకొండ గ్రేటర్ వరంగల్ లోని 31వ డివిజన్ కార్పొరేటర్ రాజు సోదరుడు కాంగ్రెస్ యువ నాయకులు మామిండ్ల సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తనయుడు కీర్తిశేషులు నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సోదరుడు నాయిని అమరేందర్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. న్యూ శాయంపేట సర్కిల్లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 31 వ డివిజన్ కు చెందిన మామిండ్ల సురేష్ అభిమానులు,యువకులు 75 మంది రక్త దానం చేశారు. జన్మదిన సందర్భంగా... కేకులు కట్ చేయడం కాదు.. పార్టీలు చేసుకోవడం కాదు.. జన్మదిన అంటే.. రక్త దానం చేస్తే సమాజానికి ఉపయోగపడుతుందని అతిథులు అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్న మామిండ్ల సురేష్ మరియు మలికాంబ మనోవికాసం కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ పెద్దలు కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ప్రజలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నేడుపాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి పర్యటన

పాలేరు ఏప్రిల్ 01( ప్రజా కలం న్యూస్ )



పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి, నేడు కూసుమంచి మండలాల్లోని వివిధ గ్రామాల్లో పర్యటించి, అనేక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఖమ్మం రూరల్ మండలం, కైకొండాయిగూడెం గ్రామంలో నూతన గృహ ప్రవేశ కార్యక్రమం. ఖమ్మం రూరల్ మండలం, రామ్ లీల ఫంక్షన్ హాల్‌లో పట్టు వస్త్రాల అలంకరణ కార్యక్రమం, చిన్నారుల ఆశీర్వాదం. ఖమ్మం రూరల్ మండలం, తల్లంపాడు గ్రామంలో గంగమ్మ గుడి ప్రారంభోత్సవం. కూసుమంచి మండలం, ధర్మ తండా గ్రామంలో పలు కుటుంబాల పరామర్శ. కూసుమంచి మండలం, కోక్యాతండా గ్రామంలో పలు కుటుంబాల పరామర్శ. కూసుమంచి మండలం, గన్యాతండా గ్రామంలో శ్రీసంత్ సేవాలాల్ విగ్రహ కమిటీ సభ్యుల మర్యాదపూర్వక సమావేశం. కూసుమంచి మండలం, పాలేరు గ్రామంలో వివాహ వేడుక, నూతన వధూవరుల ఆశీర్వాదం. కూసుమంచి మండలం, గైగొళ్ళపల్లి గ్రామ పంచాయతీ, హాట్యతండా గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి సందర్శన. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మీడియా ప్రతినిధులు హాజరు కావాలని కందాళ క్యాంపు కార్యాలయం సాయి గణేష్ నగర్, ఖమ్మం నుంచి తెలిపారు.

## పిన్నింటి అపూర్వ రావు హల్ది వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు



( వరంగల్/ పర్వతగిరి) ఏప్రిల్ 01, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు పిన్నింటి అనిల్ రావు కుమార్తె పిన్నింటి అపూర్వ రావు వివాహ మహోత్సవంలో భాగంగా బుధవారం హల్ది వేడుక నిర్వహించిన వేడుకలో నూతన వస్త్రాలు పెట్టి ఆశీర్వదించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్. ఈ కార్యక్రమంలో హన్మకొండ కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగళి వెంకట్రామ్ నరసింహ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జాటోతు శ్రీనివాస్ నాయక్, పిన్నింటి సునీల్ రావు, కర్ర హరీష్ రెడ్డి, జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, పత్రి భాను ప్రసాద్, కత్తి సుధీర్ గౌడ్, నిఖిల్ రావు, నాయకులు, కార్యకర్తలు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట మార్కెట్ యార్డ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**- మార్కెట్ కమిటీ ప్రతినిధుల వినతి పత్రం సమర్పణ**

**- లింక్ రోడ్లు, మౌలిక వసతులపై హామీ**



ఏప్రిల్ 01 ప్రజాకాలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

వ్యవసాయ మార్కెట్ కమిటీ, వర్ధన్నపేట చైర్మన్ నరుకుడు వెంకటయ్య ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కార్యదర్శి కలిసి బుధవారం వర్ధన్నపేట శాసనసభ్యులు కే ఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో రైతుల సౌకర్యార్థం పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు లింక్ రోడ్ల నిర్మాణానికి మార్కెటింగ్ మినిస్టర్ ద్వారా నిధులు మంజూరు చేయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పందిస్తూ, అవసరమైన ప్రతిపాదనలు పంపించి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఎం. శ్రీనివాస రాజు, పాలకవర్గ సభ్యులు ఎండీ ఖాజా మియా, బండి సంపత్, ఎండీ మహమూద్, అల్లే కొమురయ్య, కాటబోయిన సంపత్, ఎద్దు శ్రీను, మాల్యాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిల్మ్ నగర్ లో సీరియల్ కిల్లర్ అరెస్ట్

హైదరాబాద్ : చెవి కమ్మల కోసం వృద్ధులను హత్య చేసిన నిందితుడు డ్రైవర్ వాసును పోలీసులు అరెస్టు చేసారు. ఈ నెల 11 యాదమ్మ అనే వృద్ధురాలు మిస్సింగ్ అయింది. ఈ కేసులో వాసును అదుపులోకి తీసుకుని విచారించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విచారణలో షాకింగ్ విషయాలు నిందితుడు వాసువెల్లడించాడు. వృద్ధురాలిని నమ్మబలికి కారులో తీసుకువెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో హత్య చేశానని వెల్లడించాడు. చెవికమ్మల కోసమే వృద్ధురాలు యాదమ్మను హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. విచారణలో జూబ్లీహిల్స్లో మరో వృద్ధురాలి హత్య బయటపడింది. ఆమెను కూడ చెవి కమ్మల కోసం హత్య చేసిన వాసు చెప్పాడు. నిందితుడు ఒంటరిగా ఉన్న వృద్ధులను టార్గెట్ చేస్తాడు. హత్యల తర్వాత చెవి కమ్మలను దోచుకుని పారిపోతాడు. ఈ నేపథ్యంలో ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్ వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేసారు. మరిన్ని కేసుల్లోనూ నిందితుడి పాత్రపై అనుమానం చేస్తున్నారు పోలీసులు.

# కమలంలో కాసుల లొల్లి



హైదరాబాద్ : రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కోసం అధిష్టానం పంపిన నిధులు దుర్వినియోగమైనట్లు బీజేపీ నాయకత్వం ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. పార్టీ పంపిన ఫండ్స్ పూర్తిస్థాయిలో అభ్యర్థులకు చేరలేదని, మధ్యలో ఆయా జిల్లాల బాధ్యులు సగానికి పైగా 'స్వాహా' చేశారని గుర్తించినట్లు సమాచారం. పలు రకాల సమీక్షల అనంతరం అగ్రనేతలు ఈ అంచనాకు వచ్చినట్లు చర్చ జరుగుతున్నది. ముందుగా చెప్పిన ఓట్లు, సీట్లకు, ఫలితాలకు ఏ మాత్రం పొంతన కుదరకపోవడంతో.. అభ్యర్థుల ఓటమికి వీరే కారణమని భావిస్తున్నట్టు టాక్. ఈ నేపథ్యంలో ఫండ్స్ స్వాహా చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పార్టీ పదవుల నుంచి తొలగించాలని నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతున్నది. లోక్ సభ ఎన్నికల్లో 36 శాతం ఓట్లతో బీజేపీ ఎనిమిది స్థానాలను గెలుపొందింది. అంతేకాకుండా పార్టీకి ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు సైతం ఉన్నారు. పట్టణాల ప్రాంతాల్లో బీజేపీకి పట్టు ఉన్నదని సర్వేల ద్వారా గుర్తించగా.. మున్సిపల్ ఎన్నికలపై ఆ పార్టీ భారీ ఆశలు పెట్టుకున్నది. గతంలో కంటే స్థానాలు పెరుగుతాయని, కొన్ని మేయర్, చైర్మన్లయినా కైవసం చేసుకుంటామని భావించింది. మహారాష్ట్ర మంత్రి ఆశీష్ షెలార్ కు కీలక బాధ్యతలు అప్పగించింది. అనంతరం ఎన్నికల కోసం భారీగా నిధులు సమకూర్చినట్లు తెలిసింది. అయితే ఫలితాలను చూసి నాయకులు తీవ్ర నిరాశకు గురైనట్లు సమాచారం. దీంతో మున్సిపాలిటీలు, జిల్లాల వారీగా ఫలితాలపై పార్టీ సమీక్షించింది. కనీస స్థాయిలో కౌన్సిలర్లు, కార్పొరేటర్ స్థానాల్లో విజయం సాధించకపోవడం, చైర్మన్, మేయర్ స్థానాలను సైతం కైవసం చేసుకోవడంలో విఫలం కావడం పట్ల రాష్ట్ర నాయకత్వంపై అధిష్ఠానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా పార్టీ నాయకుల ద్వారా తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్డులు, డివిజన్లను బీజేపీ ఏ, బీ, సీ, డీ గా విభజించింది. విజయావకాశాలు ఏ మాత్రం లేని వాటిని డీ కేటగిరిలో చేర్చింది. ఆ తర్వాత ఏ, బీ, సీ కేటగిరీల వార్డులకు కొంత మొత్తాన్ని నిర్ణయించి పార్టీ జిల్లా అధ్యక్షులకు నిధులు పంపించినట్లు నేతల ద్వారా తెలిసింది. అయితే ఆ నిధుల్లో వారు అత్యధిక శాతం నొక్కేసినట్లు చర్చ జరుగుతున్నది. అంతేకాకుండా ఏ కేటగిరి డివిజన్లకు బీ, సీ కేటగిరిలకు నిర్ణయించిన మొత్తాన్ని అభ్యర్థులకు ఇచ్చినట్లు పార్టీ నాయకత్వం గుర్తించినట్లు తెలిసింది. ఇలా పది మంది జిల్లా అధ్యక్షులు పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేసినట్లు అంచనాకు వచ్చిన రాష్ట్ర నాయకత్వం.. వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఉత్తర తెలంగాణలోని ఒక జిల్లాకు చెందిన మహిళా నాయకురాలిపై అక్కడి బీజేపీ నాయకులు రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లుగా పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. పార్టీ పంపించిన నిధులను అభ్యర్థులకు ఇవ్వకుండా స్వాహా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఆమెకు అక్కడి ముఖ్య ప్రజాప్రతినిధి మద్దతు ఉన్నట్లు తెలిసింది. ఉత్తర తెలంగాణలో ఉద్యమాల జిల్లాగా గుర్తింపు ఉన్న మరో జిల్లాలో రెండంకెల ఓట్లు రాని వార్డులను సైతం ఏ గ్రేడ్ గా చూపించి నిధులను మెక్కేసినట్లు పార్టీ గుర్తించింది. అక్కడ పార్టీకి అంత పట్టులేదని ఆ తర్వాత జరిగిన సమీక్షలో పార్టీ ముఖ్యనేత చెప్పినట్లు సమాచారం.

దీంతో సంబంధిత బాధ్యుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కీలక నేతలు.. మొత్తం డబ్బులు కక్కాల్సిందేనని చెప్పినట్లు తెలిసింది. దీంతోపాటు మరికొన్ని జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిధులు స్వాహా చేశారని పార్టీ నాయకత్వం గుర్తించినట్లు సమాచారం. గతంలో బీజేపీలో ఉన్న క్రమశిక్షణ, నిబద్ధత ఇప్పుడు కరువయ్యాయని పాత కేడర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నది. అయితే డబ్బులు ఇచ్చి పదవులు తెచ్చుకున్నామని అంతర్గతంగా తమ అనుచరులకు చెబుతున్న నేతలు.. వచ్చే ఎన్నికల వరకు తమకు ఖర్చులకు డబ్బులు కావాలి కదా అనే రీతిలో మాట్లాడుతున్నట్లు చర్చ జరుగుతున్నది. అయితే నిధుల స్వాహాలో ముఖ్యంగా పది జిల్లాల బాధ్యులను గుర్తించగా.. వారిని తొలగించడం ఎంత వరకు సాధ్యమనే కోణంలో రాష్ట్ర నాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. దాని కంటే ముందు వారికి నోటీసులు ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఇలాగే నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించగా.. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇది రిపీట్ కావడంతో.. గట్టి చర్యలు తీసుకుంటేనే ఇలాంటివి పునరావృతం కావని అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతున్నది.

# బెజవాడ దుర్గమ్మ ఆలయంలో ఇంటి దొంగలు

విజయవాడ : ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో అనుమానాస్పద పరిణామాలు చోటుచేసుకున్నాయి. లెక్కింపు సమయంలో వచ్చిన అసలైన బంగారు ఆభరణాలను దారి మళ్లించేందుకు యత్నించారు. కొంతమంది సిబ్బంది రోల్డ్ గోల్డ్ గా చూపిస్తూ పక్కన పెట్టే ప్రయత్నం చేసినట్టు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులకు అనుమానం కలగడంతో వెంటనే పరిశీలన చేపట్టారు. తనిఖీల్లో సుమారు రూ.1.25 లక్షల విలువైన బంగారు వస్తువులు పక్కన పెట్టినట్టు బయటపడింది. దీంతో సంబంధిత సిబ్బందిని అక్కడికక్కడే పట్టుకుని విచారణ ప్రారంభించారు. ఈ ఘటనపై దుర్గగుడి దేవస్థానం ఈవో శీనా నాయక్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులైన సిబ్బందికి వెంటనే మెమోలు జారీ చేయడంతో పాటు, పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు ఇచ్చారు. భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలు సహించబోమని స్పష్టం చేశారు. కొత్త ట్రస్ట్ బోర్డు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలాంటి ఘటన వెలుగు చూడటం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఇప్పటికే సీసీ కెమెరాలు, త్రిసభ్య కమిటీ పర్యవేక్షణ ఉన్నప్పటికీ అక్రమాలు కొనసాగుతుండటంపై భక్తులు మండిపడుతున్నారు. దేవుడి దగ్గర కూడా అక్రమాలు అంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హుండీ లెక్కింపులో మరింత పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. భక్తుల విశ్వాసం నిలబెట్టుకోవడం దేవస్థానం ముందున్న పెద్ద సవాల్‌గా మారింది. కఠిన చర్యలు తీసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే, ఈ వివాదం మరింత పెద్దదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బిర్లా-టైమ్స్ కూటమి చేతికి ఆర్సీబీ

ఐపీఎల్ కేవలం ఒక క్రీడా టోర్నమెంట్ మాత్రమే కాదు. అది గ్లోబల్ బిజినెస్ పవర్ హౌస్ అని మరోసారి నిరూపితమైంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇన్వెస్టర్లు, కార్పొరేట్ దిగ్గజ సంస్థలు, ఐపీఎల్ ఫ్రాంచైజీలను దక్కించుకోవడానికి పోటీ పడుతున్నారు. తాజాగా రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంఛైజీలు రికార్డు స్థాయి ధరకు అమ్ముడయ్యాయి

ఆర్సీబీ దక్కించుకున్న బిర్లా-టైమ్స్ కూటమి

ఐపీఎల్లో అత్యంత క్రేజ్ ఉన్న జట్లలో ఒకటైన ఆర్సీబీ యాజమాన్యం పూర్తిగా మారిపోయింది. సుమారు 1.78 బిలియన్ డాలర్లు అంటే దాదాపు 14, 800 కోట్ల ధరకు ఈ ఫ్రాంఛైజీని ఒక పటిష్టమైన కన్సార్టియం కొనుగోలు చేసింది. ఈ కూటమిలో ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ గ్రూప్ బోల్డ్ వెంచర్స్, బ్లాక్‌స్టోన్ భాగస్వాములుగా ఉన్నాయి. డీల్లో కేవలం పురుషుల ఐపీఎల్ జట్టు మాత్రమే కాకుండా మహిళల ప్రీమియర్ లీగ్ ఫ్రాంఛైజీ కూడా దక్కించుకుంది. ఈ కొత్త యాజమాన్యం నిర్మాణంలో ఆదిత్య బిర్లా గ్రూప్ డైరెక్టర్ ఆర్యమాన్విక్రమ్ బిర్లా చైర్మన్గా టైమ్స్ గ్రూప్కు చెందిన సత్యన్ గజ్వానీ వైస్ ఛైర్మన్గా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఐపీఎల్ మొదటి సీజన్ ఛాంపియన్ రాజస్థాన్ రాయల్స్ కూడా రికార్డు స్థాయి ధరకు అమ్ముడుపోయింది. అమెరికాకు చెందిన టెక్ వ్యాపరవేత్త కల్ సోమానీ నేతృత్వంలోని కన్సార్టియం ఈ జట్టును 1.63 బిలియన్ డాలర్లకు అంటే దాదాపు 13500 కోట్లకు కొనుగోలు చేసేందుకు రెడీ అయ్యింది. ఈ డీల్లో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏంటంటే... ఈ కన్సార్టియంకు అమెరికాలని ప్రముఖ వ్యాపార కుటుంబాలు మద్దతు ఇస్తున్నాయి. అందులో ప్రపంచ ప్రఖ్యాత వాల్మార్ట్ ఫ్యామిలీ సభ్యులు ఉన్నారు. కల్సోమానీకి ఇప్పటికే రాజస్థాన్ రాయల్స్లో పెట్టుబడులు ఉన్నాయి. ఆయన టెక్ సొల్యూషన్స్, డేటా ప్రైవసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎడ్టెక్ రంగాల్లో నిష్ణాతులు. ఇంట్రాఎడ్జ్, ట్రూయో ఏఐ వంటి సంస్థల స్థాపకుడైన సోమానీకి క్రీడారంగంపై ఉన్న ఆసక్తితో ఈ భారీ డీల్కు సిద్ధమయ్యారు.

ఐపీఎల్ ఫ్రాంఛైజీల విలువ ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం వాటికి ఉన్న గ్లోబల్ అప్పీల్. పెట్టుబడిదారుల దృష్టిలో ఐపీఎల్ ఒక బలమైన అసెట్ క్లాస్గా మారింది. మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉండటం, కానీ జట్లు కేవలం పరిమితంగా ఉండటమే ఈ ప్రీమియం ధరలకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాజస్థాన్ రాయల్స్ డీల్ ఐపీఎల్ ఫ్రాంఛైజీల విలువకు కొత్త బెంచ్ మార్క్ను సెట్ చేసిందని పేర్కొంటున్నారు. ఈ భారీ పెట్టుబడులు భారత క్రికెట్ రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నాయి.

బిర్లా వంటి భారతీయ కార్పొరేట్ దిగ్గజాలు, బ్లాక్ స్టోన్ వంటి గ్లోబల్ ఇన్వెస్టర్లు ఐపీఎల్లోకి ప్రవేశించడం వల్ల ఫ్రాంఛైజీల నిర్వహణలో వృత్తి నైపుణ్యం మరింత పెరుగుతుంది. కేవలం మైదానంలో ఆటకే పరిమితం కాకుండా ఫ్యాన్స్ ఎంగేజ్మెంట్, డిజిట్ కంటెంట్, గ్లోబల్ బ్రాండింగ్ పరంగా కొత్త పుంతలు తొక్కే అవకాశం ఉంది.

# రాఘవ చుట్టూ రాజకీయం




హైదరాబాద్ : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వివాదం రోజురోజుకు ముదురుతోంది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ.. అక్రమ మైనింగ్ వ్యవహారం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. దీనిపై బీఆర్ఎస్ భారీ పోరాటం చేస్తోంది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై.. హౌస్ కమిటీ లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కారు పార్టీ డిమాండ్ చేస్తోంది. మంత్రి పొంగులేటిని తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని.. అక్రమంగా నడుస్తున్న క్రషర్ యూనిట్లను సీజ్ చేయాలని పట్టుబట్టింది బీఆర్ఎస్. రాజేంద్రనగర్ మండలం కొత్వాల్‌గూడ మానస హిల్స్ ప్రాంతంలో.. ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ క్రషర్ యూనిట్లను నడుపుతోందన్నది బీఆర్ఎస్ ఆరోపణ. దీనికి పర్యావరణ అనుమతులు లేవని.. జీవో నంబర్ 111 పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో అక్రమంగా క్వారీయింగ్ చేస్తున్నారని గులాబీ పార్టీ చాలా కాలంగా ఆరోపిస్తూ వస్తోంది. క్రషర్ వ్యవహారంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులతో ఓ నిజ నిర్ధారణ కమిటీ వేసింది బీఆర్ఎస్. మానసా హిల్స్‌లోని క్రషర్ ప్రాంతాన్ని ఈ కమిటీ రెండుసార్లు సందర్శించింది కూడా ఐతే తాము ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీ పర్యటనకు ముందే.. అక్కడున్న కంటైనర్లపై రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పేర్లను చెరిపేసి.. సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేశారన్నది బీఆర్ఎస్ నేతల ఆరోపణ. ఇదే అంశాన్ని ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనూ లేవనెత్తింది. ఈ అంశంపై గులాబీ పార్టీ నేతలు రెండు రోజులపాటు నిరసన తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ క్రషర్ అక్రమ మైనింగ్‌పై చర్చకు సీరియస్‌గా పట్టుబట్టారు. నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియంను చుట్టుముట్టడంతో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రెండు రోజులు సస్పెండ్ చేశారు. అంతకుముందు కేటీఆర్, హరీశ్ నేతృత్వంలో.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ దగ్గర ప్లకార్డులతో నిరసన తెలిపారు. దీంతో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్ వ్యవహారం.. రాజకీయ రచ్చకు కారణం అవుతోంది. ఐతే బీఆర్ఎస్ ఆరోపణలను.. సీఎం రేవంత్ తిప్పికొడుతున్నారు. గత 12ఏళ్లుగా జరిగిన మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన మైనింగ్ లీజుల అక్రమాలను కూడా బయటపెడతామని సవాల్ విసిరారు. అటు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు కూడా.. ఆరోపణలను తోసి పుచ్చారు. తాము కేవలం ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం నిబంధనల ప్రకారమే పని చేస్తున్నామని.. రాజకీయ కక్షతోనే తమపై బురద జల్లుతున్నారని అంటున్నారు. పొంగులేటి టార్గెట్‌గా బీఆర్ఎస్ చూపిస్తున్న దూకుడు.. ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. అసలు పొంగులేటి మీద ఈ రేంజ్‌లో ఎందుకు ఫోకస్ చేస్తుందనే డిస్కషన్ నడుస్తోంది. ఐతే పొంగులేటి ఇష్యూను.. బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకోవడం వెనక బలమైన కారణం ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అనేక అవకతవకలు జరిగాయని.. వివిధ శాఖల్లో సుమారు 19 స్కామ్‌లు జరిగాయని ఆరోపిస్తున్న కారు పార్టీ.. వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తోంది. ఐతే వీటిలో ఒక్కదానికి కూడా ఆధారాలు లేవు. ఇలాంటి సమయంలో మంత్రి పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ క్రషర్ వ్యవహారం.. కారు పార్టీకి ఆయుధంగా మారింది. ఆ క్రషర్‌కు అనుమతులు లేవని చెప్పడానికి.. పలుమార్లు నోటీసులు జారీ చేయడం, జరిమానా విధించడానికి సంబంధించి పూర్తి ఆధారాలు దొరికాయ్. దీంతో ఈ వ్యవహారాన్ని అంత ఈజీగా వదలొద్దని బీఆర్ఎస్ డిసైడ్ అయిందని టాక్. మంత్రి పొంగులేటి కుటుంబసభ్యులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్న వట్టినాగులపల్లి భూములను.. పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్, హరీశ్‌రావు స్వయంగా సందర్శించారు. ఆ తర్వాత లోక్‌భవన్ వెళ్లి.. గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. మంత్రి పొంగులేటి అక్రమ క్రషర్లు నడుపుతున్నారని.. హైదరాబాద్‌లో భూకబ్జాలకు పాల్పడుతున్నారని.. ఆయనను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ.. గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అటు అసెంబ్లీలో.. ఇటు బయటా.. ఇలా వదిలేదే లే అనే రేంజ్‌లో పొంగులేటిని టార్గెట్ చేస్తోంది బీఆర్ఎస్. ఈ అంశాన్ని ప్రభుత్వంపై ప్రధాన అస్త్రంగా బీఆర్ఎస్ వాడుతుంటే.. పాత ప్రభుత్వ అక్రమాలతో ముడిపెట్టి కాంగ్రెస్ ఎదురుదాడి చేస్తోంది. దీంతో రాజకీయ రచ్చ రోజురోజుకు ముదురుతోంది.

# బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

## గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు:

## ముఖ్యమంత్రి బాసర పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి:

## రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

నిర్మల్ : బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఏప్రిల్ 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సమీక్షించారు. ముందుగా పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చూశారు. పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి నిర్వహించు పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు.

ఆ తర్వాత దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి బాసర పర్యటన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ మరమ్మత్తు, నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ప్రారంభించాలని అన్నారు. జిల్లాలో పుష్కరాల నిర్వహణకు సంబంధించి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తానని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని అన్నారు. ఆయా శాఖలకు సంబంధించి అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సంబంధిత ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి మంత్రి జూపల్లి వార్నింగ్



హైదరాబాద్ : శ్రీశైలం జలాశయం నుంచి ఏపీ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలిస్తూ విద్యుత్ ఉత్పత్తి చేయడాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. నీటి మట్టం తగ్గినప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేయకూడదనే నిబంధన ఉన్నా.. ఏపీ ప్రభుత్వం దాన్ని ఉల్లంఘిస్తోందని. ఈ చర్య వల్ల తెలంగాణలో పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఏపీ అలుసుగా తీసుకుందని.. తెలంగాణ రైతుల హక్కుల కోసం సమిష్టిగా పోరాడుతామని జూపల్లి స్పష్టం చేశారు. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నా.. ఏపీ ప్రభుత్వం అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. తెలంగాణ నీళ్లు దోచుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇవాళ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మట్లాడిన ఆయన.. ఏపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు సర్కార్ బరితెగించి నీటిని దోచుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే.. ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా విద్యుత్ ఉత్పత్తి పేరిట నీటిని తరలించడం అన్యాయమని ఫైరయ్యారు. జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారని..తాము ధర్నాకు దిగే వరకు ఆ దోపిడీ ఆగలేదని మంత్రి జూపల్లి విమర్శించారు. నాడు ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించగా.. అక్రమ నీటి తరలింపును ఆపాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే పంథాను అనుసరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శ్రీశైలం నీటిలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని.. దక్షిణ తెలంగాణ రైతాంగం హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'మీరేమైనా చదువురాని వాళ్లా? జీవోలు స్పష్టంగా ఉన్నాక ఇంకా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏముంది?' అంటూ ఏపీ అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంటే.. ఏపీ ప్రభుత్వం మాత్రం చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తోందని ఫైరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవటం వల్లే ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని విమర్శించారు. ఏపీ ప్రభుత్వం తన అక్రమాలను తక్షణమే నిలిపివేయాలని లేదంటే తెలంగాణ ప్రభుత్వం,

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

## మహిళలకు ఆర్థిక భరోసా మహాలక్ష్మి పథకం - ఉచిత బస్సు ప్రయాణం వెలకట్టలేనిది

## మహిళా సంఘాలే అసలైన శక్తికి నిదర్శనం : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




ములుగు : ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్. తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఉత్సవాలు 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 29.03.2026 నాటికి 290 కోట్ల ప్రయాణాల ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ములుగు జిల్లాలో ఇప్పటి వరకు 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు 133.25 కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం పథకాలను రూపొందిస్తుందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు ఈ పథకం ద్వారా కూలీ పనులు చేసుకునే వారు, మధ్యతరగతి మహిళలు మరియు ఉద్యోగినులు ఎంతో లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ అన్నారు. "గతంలో దూర ప్రాంతాల్లో ఉన్న బిడ్డలను చూడాలంటే ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించేవాళ్లమని, ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా సాఫీగా ప్రయాణం చేస్తున్నామని" ఒక లబ్ధి పొందిన మహిళ తనతో సంతోషాన్ని పంచుకుందని గుర్తు చేశారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గర్వకారణమని,

# వైఎస్ ఫ్యామిలీలో కలహాల కాపురం



కడప: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం వైఎస్సార్ కుటుంబ అంతర్గత కలహాలు పెను దుమారం రేపుతున్నాయి. ఒకప్పుడు అభేద్యమైన కోటలా కనిపించిన ఈ కుటుంబంలో ఆస్తి పంపకాలు, వ్యక్తిగత విభేదాలు వీధిన పడటం చర్చనీయాంశంగా మారింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ షర్మిల మధ్య సాగుతున్న ఈ పోరు కేవలం కుటుంబ వ్యవహారంగా మిగిలిపోకుండా రాజకీయ రంగు పులుముకోవడం వల్ల అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాజకీయాల్లో అత్యున్నత పదవుల్లో ఉన్న నాయకులకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో కీలకం. జగన్ తన సోదరి షర్మిల లేవనెత్తుతున్న ఆస్తి వాటాల అంశాన్ని ప్రతిపక్షాల కుట్రగా భావించడం, చంద్రబాబు నాయుడు ట్రాప్‌లో ఆమె పడ్డారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపించడం గమనార్హం. వ్యక్తిగత సమస్యలను రాజకీయ కోణంలో ఎదుర్కోవడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది. తమిళనాడులో కరుణానిధి వారసుల మధ్య జరిగిన ఘర్షణలు, ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్ కుటుంబ సభ్యుల మధ్య తలెత్తిన విభేదాలు ఆయా పార్టీల ప్రతిష్టను భారీగా దెబ్బతీశాయి. ఇప్పుడు ఏపీలో కూడా జగన్ తన తల్లి విజయమ్మ, సోదరి షర్మిలపై పార్టీ నేతలతో విమర్శలు చేయించడం సొంత కేడర్‌ను సైతం విస్మయానికి గురిచేస్తోంది. రక్తసంబంధీకులపై ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల ప్రజల్లో జగన్ పట్ల ఒక రకమైన ప్రతికూల భావన ఏర్పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అమ్మ, చెల్లి ఇద్దరూ ప్రత్యర్థుల చేతిలో పావులుగా మారారనే ప్రచారం సామాన్య ఓటర్లలో ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. తన సొంత కుటుంబ సభ్యులనే ఒప్పించలేని, మెప్పించలేని నాయకత్వం రాష్ట్ర ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తుందనే ప్రశ్నలు తలెత్తుతాయి. షర్మిల ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలిగా రాజకీయ విమర్శలు చేస్తున్నప్పుడు వాటిని రాజకీయంగానే తిప్పికొట్టాలి. అలా కాకుండా ఆస్తుల గొడవను తెరపైకి తెచ్చి ఆమెను వ్యక్తిగతంగా దూషించడం వల్ల వైఎస్సార్‌సీపీ ఇమేజ్ డ్యామేజ్ అవుతోంది తప్ప ప్రత్యర్థులకు ఆయుధాలు ఇచ్చినట్లు అవుతోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. కుటుంబ సమస్యలను నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోకపోవడం వల్ల రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఒకప్పుడు జగన్ వెనుక కొండంత అండగా నిలిచిన విజయమ్మ, షర్మిల నేడు ఆయనకు దూరంగా జరగడం అనేది భావోద్వేగపూరితమైన ఆంధ్ర ఓటర్ల మనోభావాలను దెబ్బతీస్తుంది. రాజకీయాల్లో ప్రత్యర్థులతో మైండ్ గేమ్స్ ఆడటం సహజం కానీ, అది కన్నతల్లి, కన్నచెల్లితో సాగితే ప్రజల నుంచి వచ్చే స్పందన మరోలా ఉంటుంది. ఈ వివాదం ఎంత కాలం సాగితే అంతగా వైఎస్సార్ వారసత్వంపై ప్రజలకున్న నమ్మకం సడలిపోయే ప్రమాదం పొంచి ఉంది. వ్యక్తిగత ఆస్తుల వివాదాలు రాజకీయాల్లోకి చొచ్చుకురావడం వల్ల ప్రతిపక్ష పార్టీగా ఎలా పని చేస్తున్నారు అనే దానికన్నా.. ఈ వివాదమే హైలెట్ అవుతుంది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు గానీ, సంబంధిత రాజకీయ పార్టీకి గానీ అంత మంచిది కాదు. జగన్ ఈ అంశాన్ని కేవలం ఒక రాజకీయ నాయకుడిలా కాకుండా ఒక అన్నగా కుటుంబ పరిధిలోనే ముగించుకుంటేనే ఆయన వ్యక్తిగత ఇమేజ్‌కు మేలు జరుగుతుంది. లేకపోతే ఈ అంతర్గత కలహాలే భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీకి తీరని నష్టం చేకూర్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# చట్టబద్ధత అడుగులు

విజయవాడ : చట్టబద్ధత దిశగా అడుగులు పడుతున్నాయి. ఏపీ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమై అమరావతి ఏకైక రాజధానిగా గుర్తించాలని కేంద్రానికి ప్రతిపాదిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 2014 విభజన చట్టాన్ని సవరిస్తూ.. అమరావతిని కదిలించలేని స్థితిలో చట్టబద్ధత తేవాలన్న ప్రయత్నంలో చంద్రబాబు సర్కారు ఉంది. అందుకే తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. కేంద్ర ప్రభుత్వం సైతం వీలైనంత త్వరగా ఈ తీర్మానాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టి.. ఓకే చేయించే ప్రయత్నంలో ఉంది. అయితే ఇప్పుడు ఈ ప్రక్రియను ఢిల్లీ స్థాయిలో కీలక నేత ఒకరు పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం తో ప్రత్యుత్తరాలు జరుపుతూ.. వీలైనంత త్వరగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్ ఆమోదం.. ఆ వెంటనే పార్లమెంట్లో ప్రవేశపెట్టి ఆమోదించేలా కార్యచరణ సిద్ధం చేస్తున్నారు. అయితే ఇప్పుడు వెంకయ్య నాయుడు సేవలను దీనికోసం ఉపయోగిస్తుండటం మాత్రం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ రాష్ట్ర రాజధాని కి లేని చట్టబద్ధత అమరావతికి అత్యంత ఆవశ్యం అని కేంద్రానికి చెప్పడంలో వెంకయ్య నాయుడు కీలకపాత్ర పోషించినట్లు సమాచారం. బిజెపిలో కీలక పాత్ర పోషించారు వెంకయ్య నాయుడు కానీ రెండోసారి బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తరువాత అనూహ్య నిర్ణయాలు వచ్చాయి. అందులో భాగంగా వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారు. దీంతో రాజ్యాంగబద్ధ పదవిలోకి వెళ్లిపోయారు వెంకయ్య నాయుడు. అప్పటినుంచి రాజకీయాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. కానీ ఒకానొక దశలో ఆయన పేరు రాష్ట్రపతి పదవికి వినిపించింది. ఉపరాష్ట్రపతులు రాష్ట్రపతి పదవులను అలంకరించడం చాలా సందర్భాల్లో చూసాం. అదే మాదిరిగా వెంకయ్య నాయుడుకు అవకాశం వస్తుందని అంతా భావించారు. కానీ కేంద్ర పెద్దలు మాత్రం అనూహ్యంగా ద్రౌపది ముర్ముకు ఆ అవకాశం ఇచ్చారు. గిరిజన మహిళ కావడంతో జాతీయస్థాయిలో కలిసివచ్చే అంశంగా పరిగణించి అప్పట్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉపరాష్ట్రపతి పదవిని అలంకరించిన వెంకయ్యనాయుడు కార్యక్రమంలో రాజకీయాలు చేయలేకపోయారు. తెర వెనుక రాజకీయాల కు మాత్రమే పరిమితం అయ్యారు. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన తర్వాత కూడా వైయస్సార్ కాంగ్రెస్ చాలా రకాలుగా ఇబ్బందులు పెడుతోంది. అమరావతికి వ్యతిరేక ప్రచారం అధికమైంది. ఈ నేపథ్యంలో చట్టబద్ధత అనే అంశం తెరపైకి వచ్చింది. కానీ సాంకేతికంగా ఈ రాష్ట్ర రాజధానికి కూడా చట్టబద్ధత కల్పించలేని విషయాన్ని కేంద్రం స్పష్టం చేసింది.

ఈ తరుణంలో చంద్రబాబు నాయుడు సీనియారిటీ కలిగిన వెంకయ్య నాయుడుకు ఈ పని అప్పగించారు. ఏపీలో నెలకొన్న పరిస్థితులు, గత అనుభవాలను వెంకయ్య నాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వివరించారు. ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత అత్యంత ఆవశ్యం అని.. అందుకు మార్గాలను సైతం సూచించారు వెంకయ్య నాయుడు. దీంతో కేంద్ర ప్రభుత్వం సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్లో చర్చించి ఆ మరుసటి రోజు పార్లమెంటులో బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మొత్తానికైతే అమరావతి రాజధాని విషయంలో ఆది నుంచి అనుకూలంగా ఉంటూ వచ్చారు వెంకయ్య నాయుడు. ఇప్పుడు ఆయనే స్వయంగా అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో పాలుపంచుకుంటున్నారు. ఇది నిజంగా శుభ పరిణామం.

# ఏపీ కోచింగ్ సంస్థలపై కొరడా

విజయవాడ : ఏపీలో 'కస్టడీ' కోచింగ్ సెంటర్లను కట్టడి చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై కోచింగ్ పేరుతో విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలుంటాయి. రాష్ట్రంలోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల 'ఇష్టారాజ్యానికి' అడ్డుకట్ట వేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భద్రత, ఫీజుల పారదర్శకతను మెరుగుపరిచే లక్ష్యంతో ఉన్నత విద్యాశాఖ సరికొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు రిజిస్ట్రేషన్ రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది .కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగునంగా అనేక కొత్త నిబంధనలను జీవోలో పొందుపరిచారు.

ఏపీ కోచింగ్ ఇనిస్టిట్యూషన్ రూల్స్:

రోజుకు గరిష్టంగా 5 గంటలు మాత్రమే కోచింగ్ ఇవ్వాలి. పాఠశాల, కళాశాల పనివేళల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కోచింగ్ క్లాసులు నిర్వహించకూడదు.

ఆదివారాలు, ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవు దినాల్లో తరగతులు నిర్వహించడం నిషేధం.

ఏదైనా కారణంతో విద్యార్థి కోర్సు మధ్యలో వదిలేస్తే.. మిగిలిన కాలానికి సంబంధించిన ఫీజును 10 రోజుల్లోపు తిరిగి చెల్లించాలి. 'ఫీజు వెనక్కి ఇవ్వబడదు' అనే నిబంధనలు ఇకపై చెల్లవు.

ఫీజుల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను తమ వద్ద ఉంచుకోవడం చట్టవిరుద్ధం. విద్యార్థుల మార్కులు , ర్యాంకులను బహిరంగంగా హోర్డింగ్స్‌పై, వెబ్‌సైట్లలో గానీ ప్రదర్శించకూడదు. ఫలితాలను వ్యక్తిగతంగా తల్లిదండ్రులకు మాత్రమే తెలపాలి. 50 లేదా అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రతి సంస్థ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

గీత దాటితే వేటే:

నిబంధనలు రూపొందించడం మాత్రమే కాకుండా వాటి పర్యవేక్షకు కమిటీలు కూడా వేశారు. ఈ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 'జిల్లా స్థాయి పర్యవేక్షక కమిటీ' ఏర్పాటవుతుంది. దీనికి సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయి. మొదటిసారి ఉల్లంఘిస్తే 50,000 జరిమానా, రెండవసారి అదే తప్పు చేస్తే.. 1,00,000 జరిమానా విధిస్తారు. ఆ తర్వాత కూడా అలాగే జరిగితే కోచింగ్ సెంటర్ అనుమతి రద్దు అవుతుంది. పునరావృతమైతే కోచింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ రద్దు చేసి శాశ్వతంగా మూత వేస్తారు. ప్రతి కోచింగ్ సెంటర్ తప్పనిసరిగా ఒక 'వెల్‌నెస్ సెల్' ఏర్పాటు చేయాలి.

ఇందులో శిక్షణ పొందిన కౌన్సెలర్లు ఉండాలి. విద్యార్థు లు చేరిన 30 రోజుల్లోపు వారి మానసిక స్థితిని అంచనా వేసి, అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. ఆత్మహత్యల నివారణకు హాస్టళ్లలో 'యాంటీ-సూసైడ్' స్ప్రింగ్ ఫ్యాన్ల ఏర్పాటును కూడా ప్రభుత్వం సూచించింది. ముఖ్యంగా రాష్ట్రంలో ర్యాంకుల రేస్, అనారోగ్యకరమైనపోటీని నివారించేందుకు ఈ రూల్స్ తెచ్చారు. (మెడికల్), (ఇంజనీరింగ్), బ్యాంకింగ్ క్లాట్ వంటి పోటీ పరీక్షలకు లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. ర్యాంకుల గోలలో కోచింగ్ సెంటర్లు విద్యార్థులపై పడుతున్న ఒత్తిడిని పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా కార్పొరేట్ కాలేజీలు ఇంటర్మీడియట్ విద్యార్థులను బందీలుగా మారుస్తున్నాయి. రోజుకు 18గంటల పాటు కోచింగ్ పేరుతో వాళ్లని వేధిస్తున్నాయి.

ఏమిటీ కేసు..?

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఓ సంఘటన కారణంగానే ఇప్పుడు ఈ రూల్స్ వచ్చాయి. విశాఖలో కోచింగ్ తీసుకుంటున్న 17 ఏళ్ల విద్యార్థిని అనుమానాస్పదంగా మరణించిన ఘటనతో ఈ కేసు ప్రారంభమైంది. కుటుంబం విచారణ కోరగా? సుప్రీం కోర్టు కేసును సీరియస్‌గా తీసుకుంది.. సుకేదమ్ సాహా, ఆంధ్రప్రదేశ్ అనే ఈ కేసుతో కోచింగ్ సెంటర్ల పనితీరుపై పెద్ద ఎత్తున ప్రశ్నలు తలెత్తాయి. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. అన్ని రాష్ట్రాలు వాటిని అమలు చేయాలని సూచించింది.

దీంతో కోచింగ్ సెంటర్లకు షాక్ ఇచ్చేలా కొన్ని గైడ్‌లైన్స్ జారీ చేసింది:

టాప్-బాటమ్ బ్యాచ్‌లుగా విభజించడం వద్దు

పబ్లిక్‌గా విద్యార్థులను అవమానించడం నిషేధం

ఒత్తిడికి మించిన టార్గెట్స్ ఇవ్వకూడదు

ప్రతి ఇన్‌స్టిట్యూషన్‌లో కౌన్సిలింగ్ తప్పనిసరి

హాస్టళ్లలో హెల్ప్‌లైన్ నంబర్లు డిస్‌ప్లే చేయాలి

టీచర్లకు మెంటల్ హెల్త్ ట్రైనింగ్ కంపల్సరీ

రూఫ్‌టాప్, బాల్కనీలు వంటి హై రిస్క్ ఏరియాలకు యాక్సెస్ కంట్రోల్ వంటి ఆదేశాలిచ్చింది.

దానికి అనుగునంగా.. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం రూల్స్ విధించింది.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

## - నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ : నల్గొండ పట్టణంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం భాగంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పోలీసు శాఖ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ,..... రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం మరియు ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి వాహనదారు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన బాధ్యత కలిగి ఉండాలి అన్నారు. హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీస్ కళాబృందం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించింది. యమధర్మరాజు వేషధారణలో కళాకారులు హెల్మెట్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. యువత అధిక వేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని ఎస్పీ హెచ్చరించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా శిక్షార్హమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, వాహన పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డి.ఎస్.పి శివరాం రెడ్డి, సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు మరియు వాహనదారులు పాల్గొన్నారు.

# వివాదాల్లో హ్యాట్రిక్ ఎమ్మెల్యే

శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి గేట్ వే ఆఫ్ ఏపీ అని పేరు. నేతలు ఎవరైనా.. పార్టీ ఏదైనా.. పాదయాత్రలు అంటే టక్కున గుర్తొచ్చే పేరు ఇచ్ఛాపురం. టీడీపీకి తిరుగులేని ఆధిపత్యం ఉన్న నియోజకవర్గం అది. ఇక్కడి నుంచి సైకిల్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొట్టారు బెందాళం అశోక్. ప్రస్తుతం ప్రభుత్వ విప్ పదవిలో కూడా ఉన్నారు. 2019లో జగన్ హవాను తట్టుకొని సైతం ఆయన గెలిచారు. కూల్ అండ్ సైలెంట్ రాజకీయాలు చేస్తారని ఆయనకు పేరు. ఎక్కువగా తన నియోజకవర్గానికే పరిమితం అవుతూ.. పాలిటిక్స్ నడిపిస్తూ ఉంటారు. సైలెన్స్‌కు కేరాఫ్‌గా ఉండే బెందాళం అశోక్.. ఒక్కసారి వయలెంట్‌గా మారడం.. ఇప్పుడు ఉమ్మడి సిక్కోలు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. గిరిజనులు, బెంతొరియాల మధ్య సాగుతున్న ఎస్టీ సర్టిఫికెట్ల వివాదంలో ఎంటర్ కావడంతో.. బెందాళం అశోక్ కాంట్రవర్సీకి కేరాఫ్‌గా మారిపోయారు. తన నియోజకవర్గంలో 20వేలకు పైగా బెంతొరియా కులాలకు చెందిన వాళ్లు ఉన్నారని.. వారిని ఎస్టీల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు అశోక్. ఐతే దీన్ని వ్యతిరేకిస్తున్న గిరిజన సంఘాలు.. ఈ మధ్య అశోక్‌ను కలిశాయ్. ఐతే ఆ సమయంలో గిరిజన సంఘాల నేతలపై అశోక్ నోరు పారేసుకున్నారు. బూతు పురాణం అందుకున్నారు. దీంతో ఆయన తీరుపై గిరిజన సంఘాల నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేల ప్రవర్తనను వ్యతిరేకిస్తూ పోరాటాలకు సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది. బెంతొరియాలను ఎస్టీల్లో చేర్చాలనే వ్యవహారం చుట్టూ శ్రీకాకుళం జిల్లాలో కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. దీనిపై అనేక ప్రభుత్వాలు కమిటీలు వేశాయని.. అసలు బెంతొరియాలు లేరని అవి తేల్చి చెప్పాయని.. దీంతో అప్పటి కలెక్టర్ గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారని గిరిజన సంఘాల నేతలు అంటున్నారు. ఐతే ఎమ్మెల్యే అశోక్ మాత్రం ఓటు రాజకీయాలు చేస్తూ.. నకిలీ బెంతొరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యే తీరుపై గిరిజన సంఘాల నేతల తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఇక అటు సొంత పార్టీ నేతలు కూడా అశోక్ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన నేతలతో ఆయన అలా వ్యవహరించి ఉండాల్సింది కాదని అంటున్నారు. అశోక్ తీరు.. ఇప్పుడు జిల్లా పార్టీలో కొత్త చర్చకు కారణం అవుతోంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రెండు లక్షలకు పైగా గిరిజనులు ఉన్నారని.. వారి మనోభావాలు దెబ్బతింటే పార్టీకి తీరని నష్టం అంటున్నారు తెలుగు తమ్ముళ్లు. ఇక అటు గిరిజన సంఘాలు మాత్రం తగ్గేదే లే అంటున్నాయ్. ఎమ్మెల్యే ప్రవర్తనపై ఎంతవరకైనా పోరాటానికి సిద్ధం అంటున్నాయ్. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న సమయంలో ఇలాంటి వివాదాలు ఏంటి.. కుల సమస్యలు ఏంటి? అని పార్టీ సీనియర్లు పెదవి విరుస్తున్నారు. ఏమైనా మిస్టర్ కూల్ ఎమ్మెల్యే.. ఇప్పుడు జిల్లాలో మిస్టర్ హాట్‌టాపిక్‌గా మారిపోయారని జనం గుసగుసలాడుకుంటున్నారు.

# యనమల రిటైర్మెంటేనా..

కాకినాడ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో అత్యంత కీలకమైన నేతగా, మేధావిగా, వ్యూహకర్తగా వెలుగొందిన యనమల రామకృష్ణుడు రాజకీయ ప్రస్థానం ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నట్లు కనిపిస్తోంది. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన ఆయన, తాజాగా కాకినాడలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీశాయి. "పదవుల కోసం నేను ఎవరినీ సాయం కోరలేదు.. భగవంతుడు అనుకున్నదే మన జీవితంలో జరుగుతుంది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు, ఆయన రాజకీయ విశ్రాంతికి సంకేతాలా అనే అనుమానాలను బలపరుస్తున్నాయి. టీడీపీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు యనమల రామకృష్ణుడు పార్టీలో అగ్రస్థానంలో ఉంటూ వచ్చారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. చంద్రబాబుకు నమ్మినబంటుగా, పార్టీకి ఆర్థిక, రాజ్యాంగ పరమైన అంశాల్లో దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఆయన పదవీ కాలం ముగిసే వరకు ఏదో ఒక పదవిలో ఉంటూనే ఉన్నారు. అయితే, ఎమ్మెల్సీ గడువు ముగిసిన తర్వాత పార్టీ అధిష్టానం ఆయనకు తదుపరి ఏ బాధ్యత అప్పగించలేదు. యనమల రామకృష్ణుడు రాజ్యసభకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ స్థాయిలో పార్టీ వాణిని వినిపించేందుకు తనకున్న అనుభవం ఉపయోగపడుతుందని ఆయన భావించారు. కానీ, ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా అధిష్టానం ఆ దిశగా ఆలోచించడం లేదని స్పష్టమవుతోంది. "రాజ్యసభ అడిగితే వచ్చేది కాదు.. మనం అనుకున్నది భగవంతుడు చేయడు" అని యనమల అనడం వెనుక, తనకు పదవి దక్కదని ఆయన ముందే గ్రహించారా అనే చర్చ మొదలైంది. "ఇంకా నాకు పదవి ఇవ్వండి.. నేను పరిగెడతాను అని అడగలేను" అని చెప్పడం ద్వారా ఆయన తన అసహనాన్ని లేదా వైరాగ్యాన్ని ప్రదర్శించినట్లు కనిపిస్తోంది. యనమల రాజకీయ గ్రాఫ్ తగ్గడానికి ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. కాకినాడ సెజ్ భూములపై ఆయన చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీని ఇరకాటంలో పెట్టాయి. ఇది అధిష్టానానికి కొంత అసంతృప్తి కలిగించిందని సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో ఆయన అల్లుడు ఒక డ్రగ్స్ కేసులో పట్టుబడడం యనమల ప్రతిష్ఠను దెబ్బతీసింది. రాజకీయంగా క్లీన్ ఇమేజ్ ఉన్న ఆయనకు, ఈ ఘటన వ్యక్తిగతంగా, రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది. "పార్టీ మనుగడ కోసం శత్రువులకు కూడా సాయం చేశాను" అని యనమల అనడం ద్వారా పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూనే, తన సేవలకు తగిన గుర్తింపు లభించలేదనే ఆవేదనను వెలిబుచ్చినట్లు అనిపిస్తోంది. 44 ఏళ్లుగా పార్టీ తనను పోషించిందని చెప్పడం ద్వారా కృతజ్ఞత చాటుకున్నప్పటికీ, భవిష్యత్తులో తనకు ప్రత్యక్ష రాజకీయ పదవులు ఉండకపోవచ్చనే వాస్తవాన్ని ఆయన జీర్ణించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. టీడీపీ ఇప్పుడు యువ రక్తాన్ని ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. సీనియర్లకు గౌరవప్రదమైన స్థానం కల్పిస్తూనే, క్రియాశీలక పదవుల నుంచి వారిని తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే యనమలకు ఇక 'రాజకీయ విశ్రాంతి' తప్పదని ఆయన సన్నిహితులు సైతం గుసగుసలాడుకుంటున్నారు. మొత్తానికి, కాకినాడ వేదికగా యనమల చేసిన ఈ భావోద్వేగ వ్యాఖ్యలు ఒక సుదీర్ఘ రాజకీయ అధ్యాయం ముగింపునకు నాందిగా కనిపిస్తున్నాయి. అడగకుండానే పదవులను పొందిన యనమల,

# సంక్షోభం నుంచి బయిటపడదేలా...

నెల్లూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీలో రెండు సంక్షోభాలు తప్పేలా లేవు. ఒకటి అమరావతి. రెండోది అన్యమత అపవాదు. ఇటీవల అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. ఈ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన వైఖరి చెప్పలేదు. మరోవైపు ఆకివీడులో రఘురామ కృష్ణం రాజు పై అన్యమతస్తుల పేరుతో దాడి ప్రయత్నం జరిగింది. శ్రీరామనవమి నాడు శ్రీరాముడి విగ్రహానికి పూలమాలలు వేస్తుండగా కొందరు అడ్డుకున్నారు. ఆ విషయంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన వైఖరి చెప్పలేదు. ఈ రెండు ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంక్షోభాలుగా ఎదురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమరావతి రాజధాని విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలే కాదు అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. అమరావతి విషయంలో ఎటువంటి వ్యతిరేక ప్రచారం జరిగినా దాని వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నది బహిరంగ రహస్యం.. ఆది నుంచి అమరావతి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరి అలానే ఉంది. అమరావతి రాజధానికి ఏకాభిప్రాయం పేరుతో సమర్థించింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసింది. అలాగని మూడు రాజధానులను నిర్మించలేకపోయింది. అయితే ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా అమరావతికి తాము వ్యతిరేకం కాదన్న మాట పరోక్షంగా చెప్పుకొచ్చింది. కానీ అదే విషయాన్ని సభకు వచ్చి చెప్పే అవకాశాన్ని కూడా చేజేతులా కోల్పోయింది. తాజాగా ఆకివీడు వ్యవహారం పొలిటికల్ సర్కిల్లో హాట్ రేపుతోంది.

# ప్రాణంతకమైన సైనేట్ వాడకం మానవాళికి పెనుముప్పు

## - మైనింగ్ పరిసర ప్రాంతాలలో గాలి,నీరు,నేల పూర్తిగా కలుషితం

## - నీరు,భూమి కలుషితంతో కనుమరుగవుతున్న పండ్ల తోటలు

తుగ్గలి: ప్రాణాంతకమైన సైనైట్ వాడకం మానవాళికి పెనుముప్పని,మైనింగ్ కార్యకలాపాల వలన కాలుష్యం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు,పరిశ్రమలు శాఖ మంత్రి టీజీ భరత్ లకు బిజెపి రాష్ట్ర కార్యదర్శి గీత మాధురి,బీజేపీ కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి లు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులతో వారు మాట్లాడుతూ తుగ్గలి మండలంలో జియో మైసూర్ ప్రైవేట్ లిమిటెడ్ గోల్డ్ మైనింగ్ వారు జొన్నగిరి,బొల్లవానిపల్లె,పగిడిరాయి గ్రామాల పరిధిలో బంగారు వెలికి తీయుటకు అక్కడ ఫ్యాక్టరీను ఏర్పాటుచేసి మైనింగ్ పనులను ప్రారంభించారని,ఈ మైనింగ్ పనులలో భాగంగా వెలికితీసిన బంగారం శుద్ధి చేయడానికి ప్రాణాంతకమైన సైనైట్ వంటి రసాయనాలను వాడడం ద్వారా చుట్టూ ఉన్న భూగర్భ జలాలు,గాలి, భూమి కలుషితం అవుతున్నాయని వారు మంత్రులకు తెలియజేశారు. అదేవిధంగా భవిష్యత్తులో అక్కడ గ్రామాలు ఖాళీ చేయవలసిన పరిస్థితి ఉందని,ఇప్పటికే అక్కడి గ్రామాలలో క్యాన్సర్,కిడ్నీ మరియు అంతుచిక్కని వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారని,అక్కడ కనీసం తాగునీటికి శుద్ధి జలం కూడా లేదని వారు మంత్రులకు వివరించారు. అక్కడ ఉన్న పంట భూములు పళ్ళ తోటలు బాగా దెబ్బతిన్నాయని,ప్రజలు వాయు కాలుష్యం వలన అనారోగ్యం పాలవుతున్నారని కావున వెంటనే మైనింగ్ నిర్వహిస్తున్న వారిపైన,ఫ్యాక్టరీ పైన,యాజమాన్యం ఆయన తగు తీసుకోవాలని వారు మంత్రులకు వివరించారు.

ముఖ్యంగా మైనింగ్ పరిసర ప్రాంతాలలో ఉన్న పండ్ల తోటలలో భూగర్భ జలాలు కలుషితం అయి అక్కడ ఉన్న చెట్లు చనిపోయాయని,పంటలు కూడా సరిగ్గా పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు తెలియజేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ మంత్రులను కోరారు.



## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పై

# కాటా శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం

పటాన్ చేరు ఏప్రిల్ 1 (ప్రజా కలం) ప్రతినిధి

స్తాయి గురించి మాట్లాడటం అంటే నీకు ఏ స్థాయి కావాలి దొంగల గురించి మాట్లాడటం సరి కాదని నేను హరీశ్ రావుకి చెప్పాను ఆస్తులు అమ్ముకుని పేదలకు అండగా నిలబడిన కుటుంబం మాది మా కుటుంబం పేరుతో కొన్ని కాలనీలు ఉన్నాయి చరిత్ర కలిగిన కుటుంబం పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారా కేసీఆర్ మా కుటుంబానికి మంచి సంబంధాలు ఉన్నాయి కాట కుటుంబం రాజకీయ బిక్ష పెడితే నువ్వు ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నావు నీకు స్తాయి అంటే పూటకు ఒక పార్టీ మరాలనా..? భూ కబ్జాలు చేయాలా..? మూడు సార్లు గెలిచిన నీకు రాజకీయం పై అవగాహన లేదు రాజశేఖర్ రెడ్డి..చనిపోయిన తర్వాత నీకు లీజు వచ్చిందని చెపుతున్నావు 62 సర్వే నంబర్ లో శంకర్ లాల్ కి కేటాయించటం నిజమే అదే సర్వే నంబర్ లో నీవు ప్లాట్లు చేసావ్ కదా అదే నెంబర్ ఎందుకు వేయలేదు 64, 65 సర్వే నంబర్ కు సంబంధించి ఆధారాలు ఉన్నాయి 453 సర్వే నంబర్లో గీతలు గీసుకొని అమ్ముకోవడానికి సిద్ధంగా ఉన్నాడు ఇంద్రేశంలో 178 సర్వే నంబర్ లో కూడా ప్లాట్స్ వేయడానికి సిద్ధంగా ఉన్నావు అక్రమంగా వందల కోట్లు సంపాదించుకుంటున్నావు అధికారంలో ఉన్నాను అని అక్రమంగా ప్లాట్స్ వేసుకుని అమ్ముకున్నవు 62 సర్వే నంబర్ లో ఉన్న ప్లాట్లను వదిలిపెట్టం రెండు లక్షల జీతం ఉన్నవాళ్ళ నీలాగా అంతటి ఆస్తులు సంపాదించలేక పోయారు అంత సంపాదన ఎలా వస్తుందో చెప్తే ఇబ్బందుల్లో ఉన్న వారికి చాలా ఉపయోగం ఉంటది ఈడీ అటాచ్ చేసిన పత్రాలు బహిరంగం చేస్తున్న అవసరం అయితే తలకాయ నరుకుంటా తప్ప నేను తీసుకున్న స్టాండ్ లో



తప్పు లేదు చైర్మెన్ పదవికి డబ్బులు తీసుకున్నాను అన్నావ్ నిరూపిస్తావా..మాట మీద నిలబడతావా నీవు చేసిన ఆరోపణలు నిజం అని నువ్వు నమ్మితే శివాలయంలో ప్రమాణం చేద్దాం రేపు బీరంగూడలో శివాలయంలో 11 ఉదయం పసుపు బట్టలతో ప్రమాణం చేద్దాం సిద్ధమా..? నా సర్పంచ్ పదవి తీప్పించింది గూడెం మహిపాల్ రెడ్డి, హరీశ్ రావు కదా నిన్ను నువ్వు కాపాడుకోవటానికి పార్టీలు మారే చరిత్ర నీది ఇద్దరి ఆస్తులు బైటకి తీరద్దాం వేల కోట్లు ఎలా సంపాదించావో తెలుస్తుంది నాకు పది రోజులు ముందు బీ ఫారం ఇస్తే నీవు విజయం సాధించేవాడివా ఈ రెండు సంవత్సరాల్లో నీ అవినీతి బాగోతం బయట పెడతా రాష్ట్రంలో ఏ వ్యక్తిని అడిగినా నీ అవినీతి బాగోతం బయట పడుతుంది నీవు గెలిచిన మూడు సార్లు వెన్ను పోటు తోనే గెలిచావు కేసీఆర్ ని అడిగితే తెలుస్తుంది కాట కుటుంబం చరిత్ర పార్క్ స్థలాలను కూడా వదిలిపెట్టని చరిత్ర నీది

# ప్రశాంత వాతావరణంలో హనుమాన్ జయంతి శోభాయాత్ర

### నిర్వహించాలి.. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.

### హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు..



సంగారెడ్డి ప్రతినిధి: ఏప్రిల్-01(ప్రజాకలం ): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా ప్రజలకు ముందస్తుగా హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే శోభాయాత్ర రోడ్డు మార్గాలను ఎస్పీ తనిఖీ చేశారు. శోభాయాత్రలు ప్రశాంతంగా జరగడానికి జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ వివరించారు. జిల్లా నలుమూలల, పలు ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి, నిరంతరం పెట్రోలింగ్ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. హనుమాన్ జయంతి శోభాయాత్ర నిర్వాహకులకు తెలియజేయునది ఏమనగా ప్రజలు ఇబ్బందిపడే విధంగా పెద్ద శబ్దాలతో కూడిన డీజేలను ఏర్పాటు చేయకూడదని, ఇతర మతస్తుల మనోభావాలను దెబ్బతినే విధంగా వివాదాస్పద పాటలు, నినాదాలు, ప్రసంగాలు ఉండకూడదని, ర్యాలీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, సహనంగా ప్రవర్తించాలని అన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే రూమర్లు, అనవసర పోస్ట్ లను నమ్మరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా రూమర్లను ప్రచారం చేస్తే అట్టి వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు. తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# ఒక ఉత్పత్తి నిజంగా మంచిదో కాదో తెలిపే లేబుల్ గుర్తులు


హైదరాబాద్, ఏప్రిల్ 1(ప్రజా కలం ప్రతినిధి)

గోద్రెజ్ యమ్మీస్ విడుదల చేసిన స్టెమ్ 2.0 నివేదిక ప్రకారం, 85 శాతం మంది భారతీయులకు అసలు IQF అంటే ఏమిటో తెలియదు. IQF అంటే ప్రతి ముక్కను విడివిడిగా మరియు చాలా వేగంగా గడ్డకట్టించడం (ఫ్రీజింగ్). దీనివల్ల ఆహార పదార్థాలు ఒకదానికొకటి అతుక్కోవు, వాటిలోని తేమ పోదు మరియు వండేటప్పుడు మెత్తగా అయిపోవు. గోద్రెజ్ యమ్మీస్ తన అన్ని ఉత్పత్తుల కోసం ఈ IQF పద్ధతినే ఉపయోగిస్తుంది. దీనివల్ల ఫ్రీజర్ నుండి తీసిన ప్రతి ముక్క అసలు ఆకారాన్ని కోల్పోకుండా, సమంగా ఉడుకుతుంది.

ఆహార పదార్థాల ప్యాకెట్ల మీద ఉండే కొన్ని చిన్న సంక్షిప్త పదాలు . ఆ ఆహారం ఎంత నాణ్యమైనదో, ఎంత తాజాగా ఉందో, మీ దగ్గరకు చేరే ముందు దానిని ఎలా నిల్వ చేశారో స్పష్టంగా చెబుతాయి. ఐక్యూఎఫ్‌తో పాటు మీరు తప్పనిసరిగా గమనించాల్సిన మరికొన్ని ముఖ్యమైన లేబుల్ గుర్తులు ఇక్కడ ఉన్నాయి..

మీరు స్నాక్స్ నుండి నిత్యావసరాల వరకు ఏది ఎంచుకున్నా, బీబీఈ ని చెక్ చేయడం వల్ల గడువు ముగియడానికి దగ్గరగా ఉన్న వస్తువులను పక్కన పెట్టవచ్చు. ఇక న్యూరా అనేది జ్యూస్‌లు, డిప్స్, రెడీ-టు-ఈట్ మీల్స్ మరియు త్వరగా పాడయ్యే ఇతర ఆహార పదార్థాల కోసం ఉపయోగించే ఒక పద్ధతి.

తర్వాతది : దీని అర్థం సదరు ఉత్పత్తిని కేవలం గాలికి ఆరబెట్టడం కాకుండా, శీతలీకరణ ప్రక్రియ ద్వారా ఎండబెట్టారని. ఈ పద్ధతి వల్ల ఆహారంలోని రుచి, రంగు మరియు పోషక విలువలు తగ్గకుండా కేవలం తేమ మాత్రమే తొలగిపోతుంది.






## నేర పరిశోధన,శాంతిభద్రతల రక్షణ,

# విద్యార్థులకు ప్రత్యక్ష పాఠం

### సీపీతో ఒక రోజు కార్యక్రమానికి శ్రీకారం

### తొలిరోజు కమిషనర్‌తో కలిసి విధుల పరిశీలన

### ఖాకీల పనితీరుపై విద్యార్థులకు అవగాహన:





హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1:ప్రజా కలం ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పోలీసు వ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు వారిని బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో హైదరాబాద్ నగర పోలీసు విభాగం సీపీతో ఒక రోజు అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బుధవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

**క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరు**

ఏప్రిల్ 1వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుందని సీపీ తెలిపారు. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 8, 9, 10 తరగతుల విద్యార్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ప్రతిరోజూ ఒక పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు..10 మంది బాలురు, 10 మంది బాలికలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలీసు విభాగంలోని వివిధ విభాగాలను సందర్శిస్తారని స్పష్టం చేశారు.తొలిరోజు మంగళహాట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర బందోబస్తు ఏర్పాట్లపై సీపీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించారు. బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించడం, వాటి పరిష్కార ప్రక్రియను సీపీ విద్యార్థులకు వివరించారు. అనంతరం వారికి పుస్తకాలు,ప్రశంసాపత్రాలను అందజేశారు.

**కీలక విభాగాలను సందర్శించిన విద్యార్థులు**

అంతకుముందు విద్యార్థులు బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, మెయిన్ పీసీఆర్, ఐటీ సెల్, స్పెషల్ బ్రాంచ్, షీ టీమ్స్, సైబర్ క్రైమ్ వింగ్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ వంటి విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాల అధికారులు నేరాల నియంత్రణలో సాంకేతికత పాత్రను, మహిళా భద్రతను వివరించారు. పోలీసు అంటే కేవలం శిక్షించే యంత్రాంగం మాత్రమే కాదు, సమాజ భద్రతకు భరోసా ఇచ్చే సేవా వ్యవస్థ అని సీపీ సజ్జనర్ పేర్కొన్నారు.

చిన్నతనం నుంచే చట్టంపై గౌరవం, సామాజిక బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని ఆయన తెలిపారు. మహిళా భద్రత విభాగం డీసీపీ డాక్టర్ లావణ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది.విద్యార్థులు పోలీస్ శాఖ వైపు మళ్ళీ సేవ చేయాలనే ఆలోచనలు వారి మొలకత్తు తాయని ఆశిస్తున్నారు.



# పౌల్ట్రీ కంపెనీల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చికెన్ షాపుల బంద్

గజ్వేల్: 01 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

పౌల్ట్రీ కంపెనీల దౌర్జన్యపూరిత ధోరణిని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ఇచ్చిన రాష్ట్రవ్యాప్త బంద్ పిలుపులో భాగంగా, బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ చికెన్ సెంటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. ఈ సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ చికెన్ సెంటర్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గత కొంతకాలంగా పౌల్ట్రీ




కంపెనీలు వ్యాపారులకు ఇచ్చే మార్జిన్లను భారీగా తగ్గించి,పొట్ట కొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నిర్వహణ ఖర్చులు పెరిగి, లాభాలు లేక చికెన్ సెంటర్ల యజమానులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని,ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపారం చేయడం సాధ్యం కావడం లేదని వారు స్పష్టం చేశారు. పౌల్ట్రీ యాజమాన్యాలు వ్యాపారుల శ్రమను దోచుకుంటూ,అన్యాయమైన నిబంధనలతో ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. తగ్గించిన మార్జిన్లను వెంటనే పునరుద్ధరించి,వ్యాపారులకు న్యాయం చేసే వరకు మా నిరసన కొనసాగుతుందన్నారు.సమస్య పరిష్కారమయ్యే వరకు షాపులను మూసి ఉంచడానికి వెనుకాడబోము అని సంఘం నాయకులు తేల్చి చెప్పారు.పౌల్ట్రీ కంపెనీల అన్యాయానికి వ్యతిరేకంగా తాము చేస్తున్న ఈ పోరాటంలో ప్రజలు,వినియోగదారులు సహకరించాలని అసోసియేషన్ కోరింది. సామాన్యుడికి తక్కువ ధరకు చికెన్ అందాలన్నా,చిన్న వ్యాపారులు బతకాలన్నా ఈ పోరాటం తప్పనిసరని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ చికెన్ సెంటర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు ఇమామ్,హుస్సేన్, తిరుపతి,కార్యదర్శులు రాజు,ముస్తఫా, మాజీ అధ్యక్షులు శేఖర్,జహీర్, సభ్యులు బాలకృష్ణ,గౌస్,నాగరాజు,రఫీ, షాదుల్లా,సత్తయ్య,స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

# మహనీయుల జయంతోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

గజ్వేల్ :01 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

మహనీయులైన జాగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతి రావు పూలే,బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వారి జయంతులను విజయవంతం చేద్దాం మహనీయుల బాటలో నడుద్దాం



అని వారి జయంతులకు సంబంధించి కరపత్రంను బుధవారం గజ్వేల్ అంబేద్కర్ విగ్రహాన్ని దగ్గర విడుదల చేయడము జరిగినది. వారు మాట్లాడుతూ మానవ హక్కులు, ప్రజాసమ్య స్ఫూర్తి విద్యా నే ఏకైక పరిష్కారం అని చూపిన దారిలో నడవాలి అని జాగ్జీవన్ రామ్ జయంతి ఈ నెల ఐదవ తేదీన నాడు గజ్వేల్ లో గల కోతమైసమ్మ గుడి దగ్గరనుండి తూప్రాన్ రోడ్ వైపు ఉన్న బాబు జాగ్జీవన్ రామ్ విగ్రహము వరకు ర్యాలీ తీస్తున్నాం అని ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలీ అని తెలియ చేస్తున్నాము ఇట్టి కార్యక్రమంలో అంబేద్కర్ కాంప్లెక్స్ డెవలప్ మెంట్ కమిటీ అధ్యక్షులు అటుకురీ రాములు ప్రధాన కార్యదర్శి మస్కూరి కిష్టయ్య ,మన్నే కృష్ణ,కార్యదర్శి, పంబాల సత్యనారాయణ, మైస స్వామి, జయంతి నిర్వకులు పొన్నాల కుమార్ చిప్పల యాదగిరి, నిరుడు స్వామి,బండారు దేవేందర్,భైరము శివకుమార్, చిప్పల యాదగిరి,గలైంక శ్రీనివాస్, ఉబ్బని అంజనైయాలు, మైసా యాదగిరి, నరేష్ కృష్ణ సొక్కము సురేష్, పాములు పర్తి స్వామి , మైసా విజయ తదితరులు పాల్గొన్నారు



# హనుమాన్ మాల విరమణకు పాదయాత్ర విజయవంతం.

సిద్దిపేట (ప్రజాకలం) ఏప్రిల్ 01.

హనుమాన్ మాల విరమణ కార్యక్రమంలో భాగంగా సీతారాంపల్లి హనుమాన్ ఆలయం నుంచి కొండగట్టు వరకు సుమారు 135 కిలోమీటర్ల పాదయాత్రను భక్తులు విజయవంతంగా పూర్తి చేశారు. అడ్డగుట్ట గురుస్వామి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ యాత్ర భక్తి భావంతో సాగింది. పాదయాత్రలో పాల్గొన్న భక్తులు నియమ నిష్టలతో హనుమాన్ మాల ధారణ చేసి ప్రయాణం కొనసాగించారు. మార్గమధ్యంలో భజనలు, హనుమాన్ నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కొండగట్టు చేరుకున్న అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మాల విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ యాత్రలో సర్పంచ్ బొక్కల నాగరాజు, మామిళ్ల కొండల్, గంగారపు మహేష్, సుంకే వంశీ, బొక్కల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# భాషిత కాలేజీపై తీవ్రమైన భద్రతా ఉల్లంఘనలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్ యుఐ డిమాండ్



ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ఐడీపీఎల్, కుత్బుల్లాపూర్‌లో ఉన్న భాషిత కాలేజీలో జరుగుతున్న అక్రమ మరియు అసురక్షిత కార్యకలాపాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంస్థ 5వ అంతస్తులో ఫైర్ చీూజ లేకుండా మరియు అగ్నిమాపక భద్రతా నిబంధనలు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు విరుద్ధంగా హాస్టల్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

ఈనిర్లక్ష్య చర్యలు విద్యార్థుల ప్రాణాలకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి. పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, కాలేజీ యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యంగా మరియు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది.

అవసరమైన భద్రతా ప్రమాణాలు పరిశీలించకుండా అదే సంస్థకు పరీక్షా కేంద్రం కేటాయించడం ఆందోళనకర విషయం. ఇది సంబంధిత అధికారుల పర్యవేక్షణపై తీవ్రమైన సందేహాలను లేవనెత్తుతుంది.

చీూఖ× తరఫున మా డిమాండ్లు:

సంస్థపై తక్షణ సమగ్ర తనిఖీ నిర్వహించాలి

కాలేజీకి కేటాయించిన పరీక్షా కేంద్రాన్ని వెంటనే రద్దు చేయాలి

నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యంపై కఠిన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి నిర్లక్ష్యం చేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి తక్షణ చర్యలు తీసుకోకపోతే, ఈ విషయాన్ని హైకోర్టు మరియు విజిలెన్స్ సంస్థల దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత మరియు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎన్ ఎస్ యుఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుందన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# పారిశుద్ధ్యం,నీటి సరఫరా లోపం ఉండకూడదు

## - పన్నులు 100% వసూలు చేయాలి

## - మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు

వేములవాడ, ఏప్రిల్ 1(ప్రజా కలం ప్రతినిధి)

వేములవాడ మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా నిత్యం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగిన బడ్జెట్ సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ ఎన్నికలను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్న కలెక్టర్, నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మున్సిపల్ కౌన్సిల్ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. బడ్జెట్ సమావేశం ఎంతో కీలకమని పేర్కొన్న ఆమె, రెవెన్యూ వ్యయంలో భాగంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, విద్యుత్ బిల్లులు, రుణాల చెల్లింపులు, పారిశుధ్య ఖర్చులు వంటి అంశాలు ముఖ్యమని తెలిపారు. మొత్తం బడ్జెట్‌లో కనీసం 10 శాతం గ్రీన్ బడ్జెట్‌గా ఖర్చు చేసి నర్సరీలు, మొక్కల పెంపకం, సంరక్షణకు వినియోగించాలని సూచించారు.మున్సిపల్ ఆదాయం పెంపు కోసం ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులను 100 శాతం వసూలు చేయాలని స్పష్టం చేశారు. పన్నుల వసూళ్లు పూర్తి స్థాయిలో జరిగితే 15వ ఆర్థిక సంఘం నిధులు పొందే అవకాశం ఉందని వెల్లడించారు. అన్ని వ్యాపార సంస్థలు తప్పనిసరిగా లైసెన్స్ పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మున్సిపల్ బడ్జెట్‌లో మూడో వంతు నిధులను విలీన గ్రామాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలని ఆదేశించారు. మున్సిపల్ కార్మికులకు తక్షణమే బీమా సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించే విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, తడి చెత్తను ఎరువుగా మార్చి విక్రయించాలని, పొడి చెత్త ద్వారా ఆదాయం పొందాలని సూచించారు. పార్కులు, వైకుంఠధామాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణను క్రమబద్ధంగా నిర్వహించాలని తెలిపారు.

వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభానికి సిద్ధమవుతుండగా, నిర్వహణ పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నాంపల్లి గుట్టపై ఎయిర్ ఫోర్స్ యుద్ధ విమానం ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్, వార్డ్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ఇన్వెస్టిగేషన్ లో వేగం పెంచి బాధితులకు సత్వర న్యాయం అందించాలి

## -సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.


## -పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ, స్టేషన్ రికార్డులను పరిశీలించారు.

## -నేరాలు, ఆన్‌లైన్ మోసాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

## - జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.

సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్-01 (ప్రజాకలం ): సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. వివిధ నేరాలలో సీజ్ చేసిన వాహనాలను క్రమబద్ధంగా ఉంచాలని సూచించారు. స్టేషన్ రికార్డులు జనరల్ డైరీ, హిస్టరీ షీట్లు, పిటిషన్ రిజిస్టర్‌లను తనిఖీ చేస్తూ.. అన్ని రికార్డులు తాజా సమాచారం తో అప్డేట్‌గా ఉంచాలని అన్నారు. పెండింగ్ మరియు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఉండాలని ఎస్.హెచ్. ఓ కు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం "అరైవ్ అలైవ్" వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రోడ్డు నిర్మాణంలో లోపాలను, అధిక ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలనౌ గుర్తించి, ఎన్ హెచ్ ఎ ఐ తో చర్చించి, మరమత్తులు చేయించాలని అన్నారు. తరచూ వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్, నాకాబంది వంటి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించి అనుమానిత వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేయాలని






సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్దతతో నిర్వర్తించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వ్యక్తిగత సమస్యలేమైనా ఉన్నట్లయితే సంబంధిత అధికారుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, సిబ్బంది సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



# ముంగాజిపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం.

సిద్దిపేట (ప్రజాకలం) ఏప్రిల్ 01.

సిద్దిపేట జిల్లా రాయపోలు మండల పరిధిలోని ముంగజీపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ ఆసియా బేగం ఇక్బాల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నుండి మెయిన్ చౌరస్తా వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ రహదారి పూర్తికావడంతో గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని తెలిపారు. అనంతరం పాఠశాల కాంపౌండ్ వాల్‌ను పరిశీలించి, పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, వార్డ్ మెంబర్స్, పంచాయతీ సెక్రెటరీ మాధవి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




# యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సమగ్ర ఏర్పాట్లు చేయాలి

## సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి.

సిద్దిపేట (ప్రజాకలం) ఏప్రిల్ 01:

యాసంగి 2025-26 సీజన్‌లో ప్యాడీ కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులకు సూచించారు. ఐడీఓసీ సమావేశంలో మాట్లాడుతూ ఈసారి దిగుబడి అధికంగా ఉండే అవకాశమున్నందున తగిన సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, అకాల వర్షాల దృష్ట్యా ఎత్తైన ప్రదేశాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ధాన్యాన్ని బాగా ఆరబెట్టిన తర్వాత మాత్రమే తీసుకురావాలని సూచించారు. మాయిశ్చర్ మీటర్లు, గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచి, రోజువారీగా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోపాలు తలెత్తితే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, సివిల్ సప్లై అధికారి తనూజ తదితరులు పాల్గొన్నారు.

# 'మన పోలీస్ -- మన ఊరు'కు శ్రీకారం.

## తిమ్మక్ పల్లిలో 16 సీసీ కెమెరాలు ప్రారంభించిన - సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాల్.

సిద్దిపేట (ప్రజాకలం) ఏప్రిల్ 01:

గ్రామాలను సురక్షితంగా, సమాజాన్ని మరింత బలంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్ 'మన పోలీస్ -- మన ఊరు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల




రక్షణ సమిష్టి బాధ్యత అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాయపోల్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లి గ్రామాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సందర్శించారు. గ్రామస్తులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహించి, 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. గ్రామంలో ఎల్లమ్మ, పెద్దమ్మ దేవాలయాల సమీపంలో 100కు పైగా మొక్కలు నాటారు. పోలీస్ బృందం, గ్రామ యువత మధ్య జరిగిన వాలీబాల్ మ్యాచ్‌ను ప్రారంభించి వీక్షించారు. అనంతరం తిమ్మక్కపల్లి మండలప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించి పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవించడం ప్రతి బిడ్డ బాధ్యత అని సూచించారు. యువత మద్యానికి దూరంగా ఉండేలా గ్రామస్థులు చొరవ చూపాలని కోరారు. పోలీస్ శాఖ ప్రజలతో కలిసి పనిచేసే భాగస్వామి అని పేర్కొన్నారు. రాబోయే 9-10 నెలల్లో సిద్దిపేట జిల్లాలో 25 నుంచి 30 సురక్షిత గ్రామాలను రూపొందించడమే లక్ష్యమని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో కలిసి భోజనం చేస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్ రెడ్డి, ఉప సర్పంచ్ కుమ్మరి ప్రవీణ్, అడిషనల్ సిపిలు కుషాల్ కర్, సుభాష్ చంద్రబోస్, ఆయేషా, గజ్వేల్ ఏసీపీ నర్సింలు,తొగుట సిఐ లతీఫ్, ఎస్ఐ మానస, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన యూత్ కాంగ్రేస్ అధ్యక్షులు వల్లపు సుభాన్ యాదవ్ వివేకానంద కాలనీ వాసులు

మహేశ్వరం, మార్చ్ 01,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ సర్కిల్ నాదర్ గుల్ డివిజన్ లోని వివిధ కాలనీ లలో పెండింగ్ లో ఉన్నటువంటి



అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కె ఎల్ ఆర్ ని కోరడం జరిగింది. అలాగే నాదర్ గుల్ అంబేద్కర్ నగర్ రోడ్డు పనులు మధ్యంతరంలో ఆపి వేయడం జరిగింది. స్పందించిన కె ఎల్ ఆర్ అధికారులని సంప్రదించి పనులను ప్రారంభించేలా చేపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గవర్ధన్ రెడ్డి , సీనియర్ నాయకులు ఆనంద్ రెడ్డి , నాదర్ గుల్ డివిజన్ కోఆర్డినేటర్ అంకంగారి వెంకటేష్ గౌడ్, బంగారి అశోక్ గారు, మహేందర్ యాదవ్ గారు , కుమార్ యాదవ్ గారు, బంగారి మణికంఠ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి కలిసిన న్యూ గాయత్రి నగర్ కాలనీ వాసులు పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ ఆర్కల భూపాల్ ఆర్కల కామేష్ రెడ్డి,

మహేశ్వరం, ఏప్రిల్ 01,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జీ.హెచ్.ఎం.సి పరిధిలోని వార్డు నం.59లో గల న్యూ గాయత్రి



నగర్ కాలనీ వాసులు నేడు యం.యల్.ఏ క్యాంపు కార్యాలయం నందు మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పట్లోల్ల సబిత ఇంద్రారెడ్డి ని కలిసి కాలనీ పరిధిలోని రోడ్డు నం.1 నందు డ్రైనేజీ లైన్ కొరకు రోడ్డు నం.3 నందు రోడ్డు వేయుట గురించి సబిత ఇంద్రారెడ్డి ని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మీర్ పేట్ బి.ఆర్.ఎస్ పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ ఆర్కల భూపాల్ రెడ్డి,బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్కల కామేష్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ సిద్ధాల లావణ్య బీరప్ప నాయకులు సిరూర్ బాలరాజ్ పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి కి సబితా ఇంద్రారెడ్డి కు ప్రత్యేక ఆహ్వానం పలికిన మీర్పేట్ యువ నాయకులు.పల్లె అక్షయ్ గౌడ్

మహేశ్వరం, ఏప్రిల్ 01,(ప్రజా కలం)

ఏప్రిల్ 2న హనుమాన్ జయంతి సందర్భంగా (మీర్పేట్ గ్రామం) 59వ డివిజన్ కు చెందిన యువ నాయకులు పల్లె అక్షయ్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మహేశ్వరం



నియోజక వర్గము శాసన సభ్యురాలు, బిఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పి. సబితా ఇంద్రా రెడ్డి కి ప్రత్యేక ఆహ్వానాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం జిల్లెలగూడ భారీ యువకుల సమూహమున నడుమ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉమ్మడి మీర్పేట్ సర్కిల్ పార్టీ అధ్యక్షులు . అర్కల కామేష్ రెడ్డి, సీనియర్ నాయకులు అర్కల భూపాల్ రెడ్డి,సునీత బాలరాజు పల్లె జంగయ్య, దీప్లాల్ చౌహాన్,పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి అనిల్ కుమార్ యాదవ్, అవినాష్ భారీ ఎత్తున యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరంలో బీజేపీకి భారీషాక్

### - కె ఎల్ ఆర్, డి బి ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరికల జోరు

### - ఉమ్మడి ఆర్ కె పురం డివిజన్ లో బీజేపీ పార్టీకి ఊహించని షాక్

### - బీజేపీ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

### -ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి - సంక్షేమాని చూసి బీజేపీ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**మహేశ్వరం, ఏప్రిల్ 01,(ప్రజా కలం)**

మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్ లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం రెండు కండ్లుగా భావించి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముందు వెళుతున్న సదర్భంగా ఆర్ కె పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ శాసన సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యులు కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి, గార్ల సమక్షంలో బీజేపీ పార్టీ ఆర్ కె పురం డివిజన్ ప్రధాన కార్యదర్శి లికందుకూరి సుదర్శన్ మాజీ వార్డ్ సభ్యుడు గుణగంటి రమేష్ గౌడ్, ఎన్టీఆర్ నగర్ ఫేజ్ –2 అధ్యక్షుడు కర్రే రవి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి హృదయ పూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సామాన్యుడికి అందుతున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నేతలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ వైపు వస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ నాయకత్వంపై నమ్మకం కోల్పోయి, ఆ పార్టీలోని క్రియాశీలక నాయకులు బయటకు వస్తున్నారని, రాబోయే రోజుల్లో మహేశ్వరంలో బీజేపీ నామరూపాలు లేకుండా పోతుందని వారు విమర్శించారు. పార్టీలో చేరిన వారికి సరైన గుర్తింపునిస్తామని, ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. అందరం కలిసికట్టుగా పనిచేసి మహేశ్వరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ లిబండి మధుసూదన్ రావు,ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్,సురేష్ యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పిడి లింగస్వామి గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, పగడాల ఎల్లయ్య, రాజు నాయక్,వెంకటేశ్వర్లు,జ్ఞానేశ్వర్ యాదవ్,దుబ్బాక శేఖర్,యాదవ రెడ్డి,అక్బర్, శేఖర్ ముదిరాజ్,అల్లేటి కిరణ్, మహమ్మద్, భూపాల్ రెడ్డి,షఫీ,పాష పటేల్,నబీ, సమ్మద్, రేణుక, మాధవి, ఈశ్వరమ్మ, పార్వతమ్మ, లావణ్య, స్వరూపం, మరియు తదితరులు పాల్గొన్నారు.

# లేమూరు కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

### లేమూరు గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గా మొహమ్మద్ రహీమ్ మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచెన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, ఏప్రిల్ 01,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం లేమూరు గ్రామంలో లేమూరు కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి మాజీ ఎంపీటీసీ మూల హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న లేమూరు గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ రహీమ్ ని నియోజకవర్గం ఇంచార్జి కిచెన్నగారి లక్ష్మారెడ్డి గారి సన్మానించి ప్రశాంశించడం జరిగింది.గ్రామం లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం గా పని చెయ్యాలని కె ఎల్ ఆర్ సూచించడం జరిగింది. ఈ కార్యక్రమం లో టీపీసీసీ జనరల్ సెక్రటరీ మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సభవత్ కృష్ణ నాయక్, ప్రచార కమిటీ మాజీ సభ్యులు సరికొండ మల్లేష్, ఇంజమూరి రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు గ్రామ జనరల్ సెక్రటరీ మంచాల భాస్కర్, గ్రామ యూత్ అధ్యక్షులు మంచాల రాజేష్,వైస్ ప్రెసిడెంట్ గుర్రం సత్తయ్య, ఎస్సి సెల్ అధ్యక్షులు దప్పు పోషయ్య బి సి సెల్ అధ్యక్షులు సూరంపల్లి రమేష్,సెక్రటరీ గూడూరు మధుకర్ రెడ్డి,గుల్వి దేవేందర్, గౌరవ సలహాదారులు గా మూల ఇంద్రారెడ్డి,గ్యారల వీరేష్, ఎలుక సుధాకర్ రెడ్డి, అఖిల్ అహ్మద్, కడ్తల రత్నం,మంచాల లక్ష్మయ్య,చిన్నగాళ్ల కృష్ణ,గుల్వి దర్శన్, మహమ్మద్ బాబ. మహమ్మద్ సోహైల్ తదితరులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, వార్డ్ మెంబర్ కాషాంశెట్టి శేఖర్, కాషాంశెట్టి కిషన్ ఎడ్ల సత్తయ్య గంగరి శ్రీను, చింతకింది కృష్ణ,కాశంశెట్టి బలవంత్ రావు,ఎర్ర రమేష్ దప్పు కరుణాకర్జంగిలి బన్నీ, బాబా సోహైల్ కత్తుల సురేష్ పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాన్ని పర్యటించిన అడిషనల్ డీఆర్డీఓ సుభాషిణి రెడ్డి మహేశ్వరం ఎంపీడీఓ శైలజా రెడ్డి,




మహేశ్వరం,ఏప్రిల్ 01,(ప్రజా కలం)

మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామపంచాయతీ పరిధిలో ప్రాజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి సుభాషిణి రెడ్డి (అడిషనల్ డీఆర్డీఓ) గ్రామాన్ని పర్యటించారు. సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉ ప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీ, రహదారులు, టీకేపీ పనులు, డ్రైనేజీ వ్యవస్థ, చెత్త వర్గీకరణ కేంద్రం, పిపివి, జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల మరియు పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)లను సమగ్రంగా పరిశీలించారు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ గురించి అవగాహన కల్పించారు అనంతరం ఎంపీడీఓ, ఎం ఆర్ ఓ బిల్డింగ్ ,న్రేగ్స్ ఆఫీస్ నందు పెండింగ్ పనులు, సానిటేషన్ తదితర అంశాలపై సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో అడిషనల్ డీఆర్డీఓతో పాటు ఎంపీడీఓ శైలజా రెడ్డి, డీఎల్పీఓ సాంబి రెడ్డి, ఎంపీవో రవీందర్ రెడ్డి, ఏపీఓ పరిమళ, ఈసీ, టీఏలు పంచాయతీ కార్యదర్శి అలివేలు పాల్గొన్నారు.






## త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన తుక్కుగూడ మున్సిపల్ మాజీ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్

మహేశ్వరం, ఏప్రిల్ 01,(ప్రజా కలం)

జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ నాదర్గుల్ మహేశ్వరం నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు భారతీయ జనతా పార్టీ నాయకులు అందెల శ్రీరాములు యాదవ్ నివాసానికి విచ్చేసిన త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి విచ్చేసిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసిన రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ మహేశ్వరం నియోజకవర్గం మాజీ ఎంపిటిసి పూతర్ల సుదర్శన్ యాదవ్, ధీరజ్ రెడ్డి కొలను శంకర్ రెడ్డి, మద్ది రాజశేఖర్ రెడ్డి, తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు బోధ యాదగిరి రెడ్డి, వై శివకుమార్ గౌడ్, బాకీ విలాస్ బిజెపి నాయకులు జాపాల సుధాకర్, మున్సిపాలిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి మాతృమూర్తికి కె ఎల్ ఆర్ నివాళి

### - హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో దశదిన కర్మ
### - గుమ్మడవెల్లి, ఆకులమైలారంలో పార్టీ నాయకుల మృతికి సంతాపం తెలిపిన మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, ఏప్రిల్ 01,(ప్రజా కలం)

ఉదయం తొలుత ఆర్కేపురం డివిజన్ లో జరిగిన కార్యక్రమంలో ఈసందర్భంగా బీజేపీ నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్ లో చేరారు. అనంతరం గుమ్మడవెల్లిలో జరిగిన ఉపసర్పంచ్ తమ్ముడి వివాహ శుభకార్యానికి కాంగ్రెస్ నేతలతో లక్ష్మారెడ్డి హాజరయ్యారు. తరువాత గుమ్మడవెల్లి, ఆకులమైలారంలో మృతి చెందిన పార్టీ నాయకుల పార్థీవదేహానికి నివాళులు అర్పించారు. హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో.. మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి మాతృమూర్తి చంద్రకళ దశదిన కర్మలో పాల్గొన్నారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి కల్వకోల్ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ మాదిగ

మహేశ్వరం, ఏప్రిల్ 01,(ప్రజా కలం)

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కల్వకోల్ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ మాదిగ అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని కల్వకోల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ మాదిగ మాట్లాడుతూ గ్రామంలో తడి చెత్త పొడి చెత్త పరిశీలిస్తున్నట్టు తెలియజేశారు. గ్రామ కార్యదర్శి తో కలిసి గ్రామంలో పరిశు భ్రంగా విధులను ఉంచుకోవాలని అన్నారు. అదేవిధంగా పరిశు భ్రంగా లేకపోతే మనకు అనారోగ్యాల పాలై టైఫాయిడ్ మలేరియా డెంగ్యూ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## బడా బాబులైనా వదిలేది లేదు

# పాతబస్తీలో 100 కోట్ల స్థలం కాపాడిన హైడ్రా!

### - హెచ్ఎండీఏ లేఅవుట్‌లోని 6,500 గజాల క్రీడాస్థలాన్ని ప్లాట్లుగా అమ్మేసిన కబ్జాదారులు

### - జీహెచ్ఎంసీ నోటీసులకే బేఖాతర్.. చివరకు హైడ్రా ఎంట్రీతో నేలరాలిన కట్టడాలు

హైద్రాబాద్, ఏప్రిల్ 1 (ప్రజా కలం ప్రతినిధి): పాతబస్తీ మైలార్‌దేవుపల్లిలో హైడ్రా బుధవారం భారీ ఆపరేషన్ నిర్వహించింది. హెచ్ఎండీఏ అనుమతి పొందిన లేఅవుట్‌లో స్పష్టంగా క్రీడామైదానం (ప్లే గ్రౌండ్) అని పేర్కొన్నా.. ఆక్రమణలకు తెగబడిన కబ్జాదారులకు కూల్చివేతలతో బుద్ధి చెప్పింది. ఈ చర్యలతో సుమారు రూ. 100 కోట్ల విలువైన 6,500 గజాల క్రీడామైదానాన్ని కాపాడింది.



రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలార్‌దేవుపల్లి పరిధిలోని శాస్త్రిపురం కాలనీలో 188 ఎకరాల మేర హుడా అనుమతి పొందిన లేఅవుట్ ఉంది. 1,800కు పైగా ప్లాట్లు ఉన్న ఈ లేఅవుట్‌లో 6,500 గజాల స్థలాన్ని క్రీడామైదానం కోసం కేటాయించారు. అయితే, ఆ స్థలం ప్లే గ్రౌండ్‌కు కేటాయించినదని తెలిసి కూడా, గత మూడేళ్లుగా స్థానికంగా ఉన్న కొందరు కబ్జాదారులు నోటరీ మీద ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు కూడా చేపట్టారు. దీనిపై జీహెచ్ఎంసీ గతంలో నోటీసులు ఇవ్వడంతో పాటు, 2024లో కూల్చివేస్తామని 'స్పీకింగ్ ఆర్డర్లు' కూడా జారీ చేసింది. అయినా లెక్కచేయకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. దీనిపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో, అధికారులు జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లేఅవుట్ ప్రకారం అది క్రీడాస్థలమేనని నిర్ధారించుకున్న తర్వాత, నిర్మాణాలు ఆపాలని హెచ్చరించారు. బుధవారం ఉదయం రంగంలోకి దిగిన హైడ్రా.. జీ+3 అంతస్తులతో నిర్మాణ దశలో ఉన్న ఐదు భవనాలతో పాటు, మరో రెండు సింగిల్ రూమ్ నిర్మాణాలను పూర్తిగా తొలగించింది. ఇప్పటికే నివాసాలు ఉంటున్న మరో రెండు భవనాలను మాత్రం కూల్చివేత నుంచి మినహాయించింది. క్రీడామైదానం తిరిగి అందుబాటులోకి రావడంతో శాస్త్రిపురం కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే హైడ్రా చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆక్రమణలను అడ్డుకున్నందుకు గతంలో కబ్జాదారులు తమను భయభ్రాంతులకు గురిచేశారని, హైడ్రా రాకతో తమ ఏళ్ల నాటి పోరాటం ఫలించి క్రీడాస్థలం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. కబ్జాదారులు సామాన్యులు కారని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేశారు.





# ఆ జీవోలు నిరుద్యోగుల గొంతు నొక్కుతున్నాయి

### - కల్వకుంట్ల కవిత

హైదరాబాద్: ఏప్రిల్ 1: ప్రజాకలం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దక్కకుండా వివాదాస్పద జీవోలతో అడ్డంకులు సృష్టిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. బుధవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి నిరుద్యోగుల నెత్తి మీద కాలు పెట్టి తొక్కుకుంటూ వచ్చిందని విమర్శించారు. డిగ్రీ లెక్చరర్ల నోటిఫికేషన్‌లో తమ వారికి అనుకూలంగా మార్చుకు నేందుకు జీవో నంబర్ 4ను తీసుకువచ్చారని, ఇందులో పీహెచ్‌డీకి 25 మార్కుల వెయిటేజీ ఇవ్వడం ఒక కుట్రలో భాగమని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 నుంచి 40 లక్షల కుటుంబాల్లో యువత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని, కానీ ప్రభుత్వం ప్రతీ నోటిఫికేషన్‌కు ఏదో ఒక జీవోను అడ్డుపెట్టి వారి జీవితాలతో ఆడుకుంటోందని మండిపడ్డారు. తాజాగా డీఎస్సీకి జీవో 104, గ్రూప్స్‌కు జీవో 29, పోలీసు ఉద్యోగాలకు జీవో 46, గురుకులాలకు జీవో 81లు అడ్డంకిగా మారాయని, వీటిని ప్రభుత్వం ఎందుకు సమీక్షించడం లేదని కవిత ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ. 7 వేల కోట్లు ఇవ్వడానికి మనసు రాని ప్రభుత్వం, మూసీ ప్రక్షాళనకు మాత్రం అదే మొత్తాన్ని కేటాయించడం దారుణమని విమర్శించారు. ఒకవైపు ఉద్యోగాల భర్తీలో జాప్యం చేస్తూనే, మరోవైపు రేషన్ కార్డుల ఏరివేత పేరిట పేదల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తున్నారనే కుంటి సాకులతో చిరుద్యోగుల కార్డులు తొలగించే పైశాచిక పనులు మానుకోవాలని ఆమె హెచ్చరించారు. నిరుద్యోగుల కన్నీటి గాథలు వినకుండా మంత్రులు,సీఎం కాలక్షేపం చేస్తున్నారని, వెంటనే వివాదాస్పద జీవోలను రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు.






## జుబ్లీహిల్స్ సొసైటీలో ఎన్నికల్లో శీనయ్య,

# అభివృద్ధి, పారదర్శకతకు పెద్దపీట

హైదరాబాద్: ఏప్రిల్ 1 ప్రజా కలం ప్రతినిధి

ప్రతిష్టాత్మక జుబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ, క్లబ్ పాలకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఆరోపణలు, ప్రత్యారోపణలతో వాతావరణం వేడెక్కింది. ఏప్రిల్ 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో తమ ప్యానల్‌ను గెలిపించాలని కోరుతూ ప్రముఖ కాంట్రాక్టర్ బి. శీనయ్య సభ్యులను కోరారు. బుధవారం బంజారాహిల్స్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రత్యర్థి ప్యానల్‌పై విమర్శలు గుప్పిస్తూనే, తన గత అనుభవాన్ని, భవిష్యత్ విజన్‌ను సభ్యుల ముందు ఉంచారు.

**నీతి,నిజాయితీలే ప్రాతిపదికగా పనిచేస్తా-శీనయ్య**

దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న తాను, నీతి, నిజాయితీలే ప్రాతిపదికగా పనిచేస్తానని శీనయ్య స్పష్టం చేశారు. కాబూల్‌లో పార్లమెంట్ భవనాన్ని నిర్మించిన అనుభవం తనకుందాన్నరు. దేశంలో హైవేల నిర్మాణంతో మొదలైన నా ప్రస్థానం నేటికీ కొనసాగుతోందని గుర్తు చేశారు.

**శీనయ్య ప్యానల్ ప్రధాన వాగ్దానాలు:**

సభ్యత్వాల సరళీకరణ చేస్తామన్నారు. ప్లాట్ కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికీ సభ్యత్వం కల్పించడమే తమ లక్ష్యమని, ఇందులో ఎటువంటి జాప్యం ఉండదని తెలిపారు. ఇక ?పారదర్శకతకు పెద్ద పీట వేస్తని స్పష్టం చేశారు. సొసైటీకి సంబంధించిన ప్రతి లావాదేవీని వెబ్‌సైట్‌లో ఉంచి పారదర్శక పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. మరో వైపు ?అక్రమాలపై పోరాటం చేస్తామని వెల్లడించారు. గతంలో జరిగిన ప్రభుత్వ భూముల అమ్మకాలు, నకిలీ పత్రాల రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపిస్తామని, దాదాపు 150 కోట్ల రూపాయల విలువైన ఆస్తుల అన్యాక్రాంతాన్ని అడ్డుకుంటామని పేర్కొన్నారు.

**ఆసియాలోనే పెద్ద సొసైటీగా గుర్తింపు పొందిన సొసైటీ**

10 వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులున్న ఈ సొసైటీని మరింత అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ?కొత్త క్లబ్‌ల ఏర్పాటు చేస్తామని మరో 51 క్లబ్‌లను ఏర్పాటు చేసి, అసెట్స్ పెంచేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఇక

బ్యూరోక్రాట్స్‌తో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి సొసైటీని సమర్థవంతంగా నడిపిస్తామని వివరించారు.

**శీనయ్య ప్యానల్ కు పద్మారెడ్డి మద్దతు**

ఎం.ఆర్.సి. నాయుడు, నరేంద్ర చౌదరి పై పద్మారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఆఇద్దరు సొసైటీలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. 12 ఏళ్లుగా సరైన ఎన్నికలు లేక ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయని సభ్యుల్లో చర్చ జరుగుతోందన్నారు. ?సుమారు 4000 మంది సభ్యులు, 1600 ప్లాట్లు ఉన్న ఈ సొసైటీలో ఏప్రిల్ 5న జరగబోయే ఎన్నికలు జుబ్లీహిల్స్ భవిష్యత్తును నిర్ణయిస్తాయని తమ ప్యానల్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**ఏప్రిల్ 2 -- ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రజా కలం ప్రత్యేక కథనం**

## చందమామ నుండి సెల్‌ఫోన్ వరకు...

# పెరుగుతున్న ఆటిజం ప్రమాదం



ఒకప్పుడు తల్లులు చందమామను చూపిస్తూ పిల్లలకు గోరుముద్దలు తినిపించేవారు. పిల్లలు తల్లిదండ్రులతో మాట్లాడుతూ, నవ్వుతూ, ఆడుకుంటూ ఆరోగ్యంగా పెరిగేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చిన్నారుల చేతిలో సెల్‌ఫోన్, ట్యాబ్‌లు పెట్టి భోజనం పెట్టడం సాధారణమైపోయింది. ఈ మారుతున్న జీవనశైలి కారణంగా చిన్నారుల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. అందులో ముఖ్యమైనది ఆటిజం. సాంకేతిక పరికరాల వినియోగం పెరుగుతున్న కొద్దీ చిన్నారుల్లో ఆటిజం సమస్య కూడా పెరుగుతున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలు చురుకుగా లేకపోవడం, ఎవరితోనూ కలవకపోవడం, ఒంటరిగా ఉండడం, మాట ఆలస్యంగా రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయరాదని వైద్యులు సూచిస్తున్నారు.

ఆటిజం అంటే ఏమిటి?

ఆటిజం అనేది బాల్యంలోనే ప్రారంభమయ్యే నాడీ సంబంధిత అభివృద్ధి లోపం. దీనిని ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఆశాణ) అని కూడా పిలుస్తారు. ఇది పిల్లల సామాజిక నైపుణ్యాలు, సంభాషణ సామర్థ్యం, ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది. జాతి, లింగం, ఆర్థిక స్థితి వంటి భేదాలు లేకుండా ఎవరినైనా ప్రభావితం చేసే సమస్యగా ఇది గుర్తించబడింది.

**ఆటిజం ప్రధాన లక్షణాలు**

- కళ్లలోకి చూసి స్పందించకపోవడం
- పేరు పిలిచినా స్పందించకపోవడం
- మాట ఆలస్యంగా రావడం లేదా మాట్లాడకపోవడం
- ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం
- ఇతర పిల్లలతో కలవకపోవడం
- ఒకే పనిని పదే పదే చేయడం
- నవ్వినా స్పందించకపోవడం

సాధారణంగా మూడు నెలల వయస్సు నుంచే శిశువు తల్లిని గుర్తుపడుతుంది. కానీ ఆటిజం ఉన్న పిల్లల్లో ఈ స్పందన కనిపించకపోవడం ఒక ముఖ్య లక్షణంగా వైద్యులు చెబుతున్నారు.

**దేశంలో పరిస్థితి**

మన దేశంలో దాదాపు 2 శాతం పిల్లలు ఆటిజం సమస్యతో బాధపడుతున్నట్లు అంచనా. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఆటిజం ఉన్న పిల్లల్లో నిద్రలేమి, ఆందోళన, మూర్ఛ, హైపర్ యాక్టివిటీ వంటి సమస్యలు కూడా కనిపించే అవకాశముంది.

ప్రపంచ ఆటిజం అవగాహన దినం

ఆటిజంపై అవగాహన పెంచేందుకు ఐక్యరాజ్యసమితి ఏప్రిల్ 2వ తేదీని ప్రపంచ ఆటిజం అవగాహన దినంగా ప్రకటించింది. ఆటిజం ఉన్న పిల్లలకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించడం, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం.

**ఆటిజం ప్రమాదాన్ని ఎలా తగ్గించాలి?**

- వైద్య నిపుణుల సూచనలు:
- గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి
- పోషకాహారం తీసుకోవాలి
- వాయు కాలుష్యం నుండి దూరంగా ఉండాలి
- ధూమపానం, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- ఒత్తిడి తగ్గించే వ్యాయామాలు చేయాలి
- అవసరమైన టీకాలు తీసుకోవాలి
- శిశువు ఎదుగుదలను పర్యవేక్షించాలి
- తల్లిదండ్రులకు సూచనలు
- పిల్లలకు సెల్‌ఫోన్, ట్యాబ్‌ల వాడకం తగ్గించాలి
- పిల్లలతో మాట్లాడాలి
- కథలు చెప్పాలి
- ఆటలు ఆడించాలి

**ఇతర పిల్లలతో కలిసేలా ప్రోత్సహించాలి**

ఆటిజాన్ని పూర్తిగా నయం చేసే చికిత్స లేకపోయినా, ముందుగా గుర్తిస్తే పిల్లల అభివృద్ధిని మెరుగుపరచవచ్చని వైద్యులు చెబుతున్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటే చిన్నారుల భవిష్యత్తు మెరుగుపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రజా కలం ప్రత్యేకం..



**డాక్టర్ మనోజ్ రెడ్డి**
**మెడికల్ ఆఫీసర్**
**ముషీరాబాద్ అర్బన్**
**పి.హెచ్.సి దవఖాన**

# సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ ముందర ట్రాఫిక్ జామ్ పట్టించుకోని పోలీసులు

ప్రజా కలం ప్రతినిధి ఏప్రిల్ 01 సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ ముందర ఆర్టీసీ బస్సులు నడి రోడ్డుపై నిలపడంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు సంబంధిత పోలీసులు కూడా చూసి చూడనట్టుగా ఉంటున్నారు రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతుందని వివరణ కోరెందుకు టౌన్ సిఐ కి ఫోన్ లో సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రభుత్వ ఆసుపత్రి ఉండడం పోలీస్ స్టేషన్ ముందర ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు రోడ్డు పక్కన నిలిచి ఉండడంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు నడి రోడ్డుపై బస్సులు ఆపడంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి

ప్రయాణికులు బస్సు కొరకు నిలిచేందుకు మెనీ బస్సు సెంటర్ ఏర్పాటుచేసిన వినియోగంలోకి రాలేదు ఆర్టీసీ బస్సులు టౌన్ పోలీస్ స్టేషన్ ముందర నడిరోడ్డుపై ఆపడంతో వెనుక నుంచి వచ్చే వాహనదారులకు సమయం పడుతుంది కావున జిల్లా ఎస్పీ స్పందించి ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com